ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 18 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 76
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## రేవంత్ రాజీనామా చేయి...

**హైదరాబాద్ :** కేవలం కాంట్రాక్టర్లను పెంచి పోషించడానికే బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చారని ఆరోపించారు ఎమ్మెల్సీ కవిత. ఢిల్లీలో జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంపై ఆమె స్పందించారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల సీఎంలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో అచేతన సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుందని కామెంట్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు కవిత. కాంట్రాక్టర్లు, కమీషన్ల కోసమే దీన్ని కడుతున్నారని ఆరోపించారు. అంతా కలిసి మెగా సంస్థకు ప్రాజెక్టు కట్టబెట్టే ప్రయత్నాల్లో ఉన్నారని విమర్శించారు. "కాంట్రాక్టర్లు, కమీషన్ల కోసం బనకచర్ల కడుతున్నారు.




# నీళ్ల ద్రోహి కేసీఆరే

### పదేళ్లలో కృష్ణాలో 1200 టీఎంసీలు పోనిచ్చిండు.. కృష్ణా, గోదావరి జలాలపై మేం చర్చిస్తే తప్పేంటి?



- గతంలో చంద్రబాబుతో కేసీఆర్, హరీశ్‌రావు చర్చించలేదా?
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- నదీ జలాల విషయంలో భారత్-పాకిస్తాన్ మధ్యే చర్చలు
- కేంద్రం చర్చకు పిలిస్తే ఢిల్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కు రావాలా?
- సినిమాల్లో విలన్లను ఆఖర్లో చంపుతారు.. 'కాళేశ్వరం' విషయంలోనూ మెల్లగా అరెస్టులు..
- కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం.. కొట్లాట నా చివరి అస్త్రం

సెప్టెంబర్ లోగా స్థానిక ఎన్నికలు

**సూర్య న్యూస్ న్యూఢిల్లీ**

'నదీ జలాల విషయంలో భారత్-పాకిస్తాన్ మధ్యే చర్చలు జరుగుతున్నాయి. నీటి పంపకాలపై రెండు దేశాలు మాట్లాడు కుంటున్నాయి. అలాంటప్పుడు కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించిన అంశాలపై పొరుగు రాష్ట్రంతో మేం చర్చిస్తే తప్పేంటి. నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో చర్చలే వద్దన్న తరహాలో బీఆర్ఎస్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. 2015%-%16లో చంద్రబాబునాయుడుతో చర్చలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ వెళ్లలేదా? ఇప్పుడు మేము వెళితేనే నొప్పొచ్చిందా?. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగాలి. మేము రాజకీయంగా బతకాలన్నది వారి కోరిక. అందుకే మా భేటీపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. కేంద్రంతో కలిసి పనిచేసేందుకు కూడా మాకెలాంటి అభ్యంతరం లేదు. నేనెవరికీ భయపడను. కేవలం సిస్టమ్‌కు మాత్రమే భయపడే వ్యక్తిని. నా ప్రాధాన్యత రాష్ట్రం. సమస్య ఉంటే చర్చలతో పరిష్కరించుకుంటా. కొట్లాట నా చివరి అస్త్రం. ఇదే ధోరణిలో కేంద్రంతో పాటు పక్క రాష్ట్రం ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాం. కొట్లాడుకుంటూ పోతే పాలకులకు కాదు, ప్రజలకు నష్టం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాల అంశంపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన భేటీలో - మిగతా2లో



## జాతీయ ప్రయోజనాలే ముఖ్యం

- రష్యా చమురు విషయంలో ద్వంద్వ ప్రమాణాలు వద్దు
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టీకరణ
- జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ అవసరాల ఆధారంగానే రష్యా నుంచి చమురు కొనుగోలు

3



## ఫడణవీస్‌తో ఉద్ధవ్ భేటీ

- అధికార పక్షం వైపు రావాలని ఆహ్వానించిన మరుసటి రోజే సమావేశం
- బీజేపీతో శివసేన (యూబీటీ) మళ్లీ దోస్తీ?
- మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ

## ఆరడుగులు పెరిగాడే కానీ.. అరంగుళమైనా మెదడు పెంచుకోలేదు



- హరీశ్ వాదనలో పస లేదు: మహేష్‌కుమార్‌గౌడ్
- అడ్డగోలు వాదనలు, అర్థంలేని తర్కం చేస్తూ తెలంగాణ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నడు.
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పినా బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మెదడుకు ఎక్కలేదు.

2



## రేవంత్‌వి చెత్త వ్యాఖ్యలు

- చీకటి బాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకే కేటీఆర్‌పై ఆరోపణలు
- మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్‌రావు
- మేం బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నాం
- ఆయన డ్రగ్స్ అంటూ మోకాలుకు, బోడిగుండుకు ముడి పెడుతున్నారు

**సూర్య న్యూస్ హైదరాబాద్**

బనకచర్ల విషయంలో ఢిల్లీ సమావేశంలో తన నిజ స్వరూపాన్ని బట్టబయలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, తన చీకటి బాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకు కేటీఆర్‌పై చెత్త వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి పక్కన ఉన్న వారంతా గార్బేజ్ (చెత్త) బ్యాచేనని, కాలుష్యం అధికంగా ఉండే ఢిల్లీలో రేవంత్‌రెడ్డి చెత్త వ్యాఖ్యలతో అది మరింత పెరిగిందని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. 'బనకచర్ల ప్రాజెక్టు ఢిల్లీ భేటీ ఎజెండాలో ఉందని ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు - మిగతా2లో




## ఏఐతో.. ముప్పు!

- ఉద్యోగాలకు ప్రమాదం ఉందంటున్న నిపుణులు
- నైపుణ్యాలు పెంచుకునేందుకు 'అప్‌స్కిల్లింగ్' బాట
- ఆరు నెలల్లోపు కెరీర్ ప్రోగ్రామ్స్‌పై అత్యధికుల ఆసక్తి
- ఏఐ, మెషీన్ లెర్నింగ్ స్కిల్స్‌పైనే ప్రధాన ఫోకస్

3



## 'స్థానిక' ఎన్నికల కోసమే రైతు భరోసా

- ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైంది?
- రైతుల విషయంలో కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శ

# సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి



- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వండి
- ఖాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి
- హైదరాబాద్ డ్రైపోర్టు-బందరు లైన్ మంజూరు చేయండి

**సూర్య న్యూస్ న్యూఢిల్లీ**

రాష్ట్రంలో సెమీకండక్లర్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివద్ధి కేంద్రాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. అందువల్ల ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ప్రాజెక్టు, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్టు క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కోరారు. రెండురోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన సీఎం..గురువారం రైల్ భవన్‌లో అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ - మిగతా2లో

## వ్యవస్థీకృతంగా మారిపోయిన వీసా మోసాలు

- త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తామంటూ అమాయకుల నుంచి లక్షల్లో వసూళ్లు
- నకిలీ, ఫోర్జరీ పత్రాలతో విదేశాలకు..
- అక్కడ పట్టుబడి కేసులు, జైళ్ల పాలవుతున్న బాధితులు
- గత ఐదేళ్లలో 5 వేలకుపైగా నకిలీ వీసాలు తయారు చేసిన ఓ ఢిల్లీ ముఠా
- డబ్బులూ పోయి, విదేశాల్లో ఉద్యోగం ఆశలూ ఆవిరై కుంగిపోతున్న బాధితులు

3



# నీళ్ల ద్రోహి కేసీఆరే..

-మొదటిపేజీ తరువాయి

పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన సీఎం గురువారం తన అధికారిక నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. పలు అంశాలపై వివరంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

**కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే..**

కేంద్ర జలశక్తి మంత్రి వద్ద సమావేశంలో బనకచర్లపై చర్చ జరగలేదు. జలశక్తి శాఖ తన ప్రకటనలో కూడా అదే చెప్పింది. ఆ భేటీ భవిష్యత్ కార్యాచరణకు రోడ్‌మ్యాప్ వంటిది. మేం పూర్తిగా కేంద్రానికి సహకరిస్తాం. వారి సహకారం తీసుకుంటాం. కలిసి పనిచేస్తాం. నిధులైనా, అనుమతులైనా అడగకపోతే ఎవరూ ఇవ్వరు. కాబట్టి అడిగి తీసుకుంటాం. కేంద్రం పిలిస్తే మీరెందుకు వెళ్తారని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర పిలిస్తే ఢిల్లీకి రాకుండా, ఫాంహౌస్‌కు రావాలా? కేంద్రం వద్ద వాదన వినిపించకుండా, ఫాంహౌస్‌లో వాదించాలా? కేసీఆర్‌తో నాకు ఎలాంటి శత్రుత్వం లేదు, ఆయన నాకు కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమే. ఆయనతో ఏ అంశంపై అయినా చర్చకు సిద్ధమే.

**అన్నీ అధ్యయనం చేశాకే 'ఇచ్చంపల్లి'..**

కేంద్ర ప్రభుత్వమే గోదావరి%–%కావేరి నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి%–%నాగార్జునసాగర్ ప్రతిపాదనను ఇచ్చిం ది. తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేదైతే ఈ లింక్‌పై చర్చిస్తామని కేంద్రానికి చెప్పాం. ఎప్పుడో తయారు చేసిన డీపీఆర్ ప్రకారం అయితే దీనికి ఒప్పుకునేది లేదు. అది తయారయ్యాక ఎగువ రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులు వచ్చేశాయి. కాబట్టి ప్రస్తుతం నీటి లభ్యత ఎంత ఉందో తేలాలి. వందేళ్ల రాష్ట్ర అవసరాలకు సరిపడా నీటి లభ్యత, అవసరాలు అన్నీ అధ్యయనం చేశాకే ముందుకెళ్తాం తప్ప గుడ్డిగా వ్యవహరించం.

**400 టీఎంసీలు చాలన్నది కేసీఆరే..**

నీళ్ల ద్రోహి కేసీఆరే. 2004%–%2014 వరకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి రోజుకు 4.1 టీఎంసీల చొప్పున నీళ్లు తరలించుకుపోతే, 2014%–%23 మధ్య ఆ సామర్థ్యాన్ని ఏకంగా 9.6 టీఎంసీలకు పెంచనిచ్చిం ది కేసీఆరే. అంతకుముందు ఉమ్మడి ఏపీలో పదేళ్లలో 727 టీఎంసీలు ఏపీ తరలించుకుపోతే, బీఆర్‌ఎస్ పదేళ్ల హయాంలో ఏకంగా 1,200 టీఎంసీల నీటిని ఏపీకి పోనిచ్చాడు. దీన్నిబట్టి నీళ్ల ద్రోహి ఎవరో తెలుస్తోంది. మరోవైపు 2023లో కృష్ణా జలాల్లో 400 టీఎంసీలు చాలు అన్నది కేసీఆరే.

గోదావరిలో 3వేల టీఎంసీలు వృధాగా పోతున్నాయి. వాటిని వాడుకోండని ఏపీకి చెప్పింది ఆయనే. చేపల పులుసు తిని అది అరిగేదాకా కూడా ఆగకుండా నీళ్లు వాడుకోమని చెప్పారు. ఇదే సమయంలో 'కాళేశ్వరం' కూలిపోతే ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. మేం ఒక్కొక్కరిపై చర్యలు తీసుకుంటున్నాం. సినిమాల్లో విలన్లను ఆఖరిలో చంపినట్లు ఇక్కడా మెల్లిగా అరెస్టులు జరుగుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ అరెస్టు చివర్లోనే జరిగింది కదా.

**42% రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేక వ్యూహం**

2014కు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక 23 శాతానికి తగ్గించారు. రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చి బీసీలకు అన్యాయం చేశారు. ప్రస్తుతం 50 శాతం క్యాప్‌ను ఎత్తివేస్తున్నాం. 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మాకు ప్రత్యేక వ్యూహం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేసి తీరుతాం.

కోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు పెడతాం. అందుకే ఆర్డినెన్స్, మిగతా ప్రక్రియపై దృష్టి పెట్టాం. గుజరాత్, యూపీ, మహారాష్ట్రల్లో ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించాక, తెలంగాణలో రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడాలి. రాష్ట్రంలో రెండేళ్ల తర్వాతే కొత్త నామినేటెడ్ చైర్మన్ పోస్టులు ఇస్తాం. అప్పటివరకు ప్రస్తుత కార్పొరేషన్లకు డైరెక్టర్లు, సభ్యులను భర్తీ చేస్తాం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా పోటీ చేస్తుంది.

**లోకేశ్‌ను కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిసినట్లు?**

'నేను అధికారికంగా చర్చలో పాల్గొంటే తప్పు అంటున్నారు. మరి ఇటీవల ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కేటీఆర్ ఎందుకు కలిశాడు?, చీకట్లో కలవాల్సిన అవసరం ఏముంది?. లోకేష్‌తో భేటీ అయిన మాట వాస్తవం కాదా? చెప్పమనండి..' అని రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. లోకేశ్‌ను కలిసినట్లు మీకెలా తెలిసింది? మీరు కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని ఆయన అన్నారు. ఆ విషయాన్ని మాకు కళ్ల ముందు ఉన్న వ్యక్తులే చెప్పారని తెలిపారు.

**కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్**

కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్ అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'ఆ గంజాయి బ్యాచ్ సవాల్ విసిరితే నేను స్పందించాలా? కేటీఆర్ బిజినెస్ భాగస్వామి కేదార్ రకరకాల డ్రగ్స్ వాడి దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. లిక్కర్‌లో కాక్‌టెయిల్ విన్నాం..కానీ ఇక్కడ గంజాయి, డ్రగ్స్ కాక్‌టెయిల్ అని వింటున్నాం. అతని ఫోరెన్సిక్ రిపోర్టును తెప్పించాం. సందర్భాన్ని బట్టి మీడియా ద్వారా బయటపెడతాం. అవసరమైతే అసెంబ్లీలో పెట్టడానికి సిద్ధమే. ఆయన బావమరిది ఫాంహౌస్‌లో సమీప గ్యాంగ్ అంతా గంజాయి, డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డారు. ఇలా కేటీఆర్ చుట్టూ ఉన్న వాళ్లంతా గంజాయి బ్యాచే..' అని సీఎం ఆరోపించారు.

**మిగిలింది కేటీఆరే..**

మున్సిపల్ శాఖలో అక్రమాలకు సంబంధించి కీలక అధికారి బాలకృష్ణ అరెస్టు అయ్యారని, ఇక మిగిలింది కేటీఆర్ మాత్రమేనని ముఖ్యమంత్రి అన్నారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారు. కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. గతంలో నా ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిన కిషన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదు? కొత్తగా ఫోన్ ట్యాపింగ్ కేసు కేంద్రానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏడాదిన్నరగా ప్రభాకరావును కాపాడింది ఎవరు? ఇదే బీజేపీ, బీఆర్‌ఎస్ కాదా?..' అని రేవంత్ ప్రశ్నించారు.

# సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

-మొదటిపేజీ తరువాయి

అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఈఎంసీ 2.0 పథకం కింద తెలంగాణ ఇచ్చిన వినతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. రీజినల్ రింగు రైలుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

**హైదరాబాద్ డ్రైపోర్టు-బందరు లైన్ మంజూరు చేయండి**

రాష్ట్రంలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని..ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. రూ.8 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. 'రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది..'అని చెప్పారు. హైదరాబాద్ డ్రైపోర్టు నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కోరా రు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందన్నారు.

**కొత్త రైలు మార్గాలు మంజూరు చేయండి**

ఖాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు అంశాన్ని సీఎం రేవంత్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ



రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్లను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఖాజీపేట రైల్వే డివిజన్ అవసరమని తెలిపారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవల కోసం దీనిని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలో వివిధ ప్రాంతాల అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతుల కోసం.. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్-కృష్ణా (122 కి.మీ.%–%అంచనా వ్యయం రూ.2,677 కోట్లు) కల్వకుర్తి%–%మాచర్ల (100 కి.మీ.%–%అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు), డోర్నకల్%–%గద్వాల (296 కి.మీ.%–%అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్%–%మిర్యాలగూడ (97 కి.మీ.%–%అంచనా వ్యయం 2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

## బొత్స కుటుంబంలో చీలక...

విజయనగరం

బొత్స కుటుంబంలో చీలిక వచ్చిందా? ఆధిపత్య పోరు ప్రారంభం అయ్యిందా? వచ్చే ఎన్నికల్లో తలో దారిన వెళ్ళనున్నారా? విజయనగరం పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఓ నేత రాజకీయ చిరకాల ప్రత్యర్థిని ప్రశంసించడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల గోవా గవర్నర్గా సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన నియామకంతో టిడిపి కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. సీనియారిటీతోపాటు సిన్సియారిటీకి సరైన గౌరవం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అశోక్ గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అనూహ్యంగా తన చిరకాల ప్రత్యర్థి అయిన బొత్స కుటుంబం నుంచి ఓ మాజీ ఎమ్మెల్యే అశోక్ గజపతి రాజుకు అభినందనలు తెలపడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుందివిజయనగరం జిల్లాలో) బొత్స కుటుంబానిది ఒక హవా. కాంగ్రెస్ హయాంలో పెనుమత్స సాంబశివరాజు ఒక వెలుగు వెలిగారు. ఆయన శిష్యరికంలో పనిచేశారు బొత్స. కానీ తనకున్న సామాజిక, కుటుంబ బలంతో ఒక రాష్ట్రస్థాయి నేతగా ఎదిగారు. ఉత్తరాంధ్రలో తనకంటూ ఒక మార్క్ చూపించారు. విజయనగరం జిల్లాలో అశోక్ గజపతిరాజుకు ధీటుగా రాజకీయాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు మొన్నటి వైసిపి ప్రభుత్వం లో ఒక వెలుగు వెలిగారు. తాను చీపురుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రి పదవి చేపట్టేవారు. సోదరుడు అప్పల నరసయ్య గజపతినగరం నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. మరో సమీప బంధువు బడ్డు కొండ అప్పలనాయుడు నెల్లిమర్ల శాసనసభ్యుడిగా ఉండేవారు. స్వయానా మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్గా ఇప్పటికీ కొనసాగుతున్నారు. అయితే మొన్నటి ఎన్నికల్లో బొత్స తో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా ఓడిపోయారు. ప్రస్తుతం బొత్స విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నారు. పైగా శాసనమండలిలో విపక్ష నేతగా కొనసాగుతున్నారు.విజయనగరం జిల్లాలో పూసపాటి అశోక్ గజపతి రాజుతో బొత్స కుటుంబానికి దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. అయితే ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు అశోక్ గజపతిరాజు. ఈ క్రమంలో అశోక్ ను గోవా గవర్నర్ గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆకాశానికి ఎత్తేశారు. రాజకీయాలకే వన్నెతెచ్చిన నాయకుడు అశోక్ గజపతి రాజు అని కొనియాడారు. అటువంటి నేత జిల్లా వాసి కావడం గర్వకారణంగా చెప్పుకొచ్చారు. అయితే బొత్స కుటుంబ వ్యక్తి ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థిని ప్రశంసించడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. గత కొద్దిరోజులుగా బడ్డు కొండ అప్పలనాయుడుకు బొత్స కుటుంబంతో విభేదాలు ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అప్పలనాయుడు అశోక్ గజపతి రాజును ప్రశంసించడం చర్చకు దారితీస్తోంది. రకరకాల రచ్చకు కారణం అవుతోంది.నెల్లిమర్ల ఇన్చార్జిగా బడ్డుకొండ అప్పలనాయుడు ను తప్పిస్తారని ప్రచారం నడుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన టిడిపిలో చేరుతారని కూడా టాక్ నడిచింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో బొత్స సోదరుడు వేలు పెట్టడం వెనుక పెద్ద స్కెచ్ ఉందన్నది అప్పలనాయుడు లో ఉన్న అనుమానం.

## రేవంత్‌వి చెత్త వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

చెపుతుంటే, రేవంత్‌రెడ్డి అసలు చర్చకే రాలేదని అంటున్నారు. కేంద్ర జలశక్తి నిర్వహించిన సమావేశంలో బనకచర్లపై చర్చ జరిగినట్లు ఏపీలోని అన్ని పేపర్లలో వచ్చింది. లైయింగ్ సిండ్రోమ్ అనే వ్యాధితో రేవంత్‌రెడ్డి బాధ పడుతున్నాడు. అందుకే అబద్ధాలు చెపుతున్నాడు.

**కేటీఆర్ మీలా బ్యాగ్‌లు మోయలేదు..**

మేము బనకచర్ల గురించి మాట్లాడుతుంటే ఆయన డ్రగ్స్, గంజాయి అంటూ మోకాళ్లకు, బోడి గుండుకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డిలా కేటీఆర్ బ్యాగ్‌లు మోయలేదు. ఆయన చుట్టూ ఉన్నవారు కూడా బ్యాగులు మోసేవారే. పరిపాలన అంటే బ్యాగ్‌లు మోసుడు కాదని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి. కేటీఆర్‌ను లోకేశ్ అర్ధరాత్రి పూట కలిశాడని అంటున్నాడు. రాష్ట్రంలో అర్ధరాత్రి పూట గోడలు దూకే అలవాటు రేవంత్‌రెడ్డికే ఉంది. ఎవడో దుబాయ్‌లో చనిపోతే కేటీఆర్‌కు ఏం సంబంధం? కేటీఆర్‌పై చేసిన ఆరోపణలకు రుజువులు ఉంటే చూపించాలి. లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి..'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

**శాంతిభద్రతలు పూర్తిగా విఫలం**

'కాంగ్రెస్ పార్టీ పాలనలో మలేరియా, డెంగ్యూ వంటి రోగాలతో గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆస్పత్రుల్లో ఉంటున్నారు. మరోవైపు గ్రామాల్లో పాలన పడకేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయి. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై, నా క్యాంపు కార్యాలయంపై, పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై, సునీత లక్ష్మారెడ్డిపై, మర్రి రాజశేఖర్‌రెడ్డిపై దాడికి దిగుతున్నారు..'అని మాజీమంత్రి చెప్పారు.

**మా ఫోన్లతో పాటు విలేకరులవీ ట్యాప్ చేస్తున్నారు..**

'రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అండగా ఉంటున్నాడు కాబట్టే ఈడీ ఆయన్ను అరెస్టు చేయడం లేదు. మాపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఇంటెలిజెన్స్ వ్యవస్థతో నిఘా పెట్టినా మాకేం కాదు. రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నాడు. విలేకరుల ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నాయి..'అని హరీశ్‌రావు ఆరోపించారు.

## 'స్థానిక' ఎన్నికల కోసమే రైతు భరోసా

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కాంగ్రెస్ ప్రభు త్వం రైతుభరోసా నిధులు విడుదల చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్ర రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోందని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చాక 19నెలలు రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు వారి శ్రేయస్సు గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కిసాన్‌మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైంది? ధరణిని భూభారతిగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. అనేకమంది రైతులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలిచ్చే పరిస్థితి లేదు. రిటైరైన ఉద్యోగులకు ప్రయోజనాలు అంద డం లేదు" అని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చ్టేస లక్ష్యంతో మార్కెటింగ్, రుణ సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. కేంద్రం వైఖరి కారణంగానే యూరియా కొరత ఏర్పడిందంటూ రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు. గుజరాత్‌లో రైతు ఉద్యమాలు కేంద్రంగా భారతీయ కిసాన్ సంఘ్ పనిచేసి, బీజేపీ గెలుపునకు మూల స్తంభంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోనూ కిసాన్‌మోర్చా రైతులతో మమే కం కావాలని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను వివరించాలని పిలుపునిచ్చారు.

**ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి షెడ్యూల్**

రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి గురువారం షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 19 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుండగా.. ఆగస్టు 10 వరకు సీట్ల భర్తీ చేసుకునే అవకాశం కల్పించింది. అర్హత, ఎంపిక విధానానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశామని మండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి కోరారు. మరిన్ని వివరాల కోసం కళాశాలల అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు. కాగా, ప్రైవేటు కాలేజీల్లో 70శాతం సీట్లను ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తుండగా, మిగతా 30శాతం సీట్లను యాజమాన్య కోటా ద్వారా భర్తీ చే స్తారు.

## ఆరడుగులు పెరిగాడే కానీ..

## అరంగుళమైనా మెదడు పెంచుకోలేదు



హైదరాబాద్

"ఢిల్లీలోని జలశక్తి కార్యాలయంలో జరిగిన ఏపీ, తెలంగాణ సీఎంల సమావేశంలో ఏయే అంశాలపై మాట్లాడింది.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడించినా.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పినా బీఆర్‌ఎస్ నేత హరీశ్ రావు మెదడుకు ఎక్కలేదు. ఆయన ఆరడుగులు పెరిగాడే కానీ.. మెదడును అరంగుళం కూడా పెంచుకోలేదు. అడ్డగోలు వాదనలు, అర్థంలేని తర్కం చేస్తూ తెలంగాణ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నడు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడగానే.. ఏదో ఒకటి మాట్లాడి ఉనికి చాటుకోవాలనే తపనే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆయనకు పట్టింపు లేదు" అంటూ టీపీసీసీ చీఫ్ మహేషగౌడ్ ధ్వజమెత్తారు. హరీశ్ వాదనల్లో పసే లేదని గురువారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి అసెంబ్లీలో చర్చిద్దాం రండి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌కు సవాల్ విసిరితే అటునుంచి స్పందన ఏదని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్లు పెట్టి కోడిగుడ్డుపై ఈకలు పీకాలని చూస్తే ప్రజలు నమ్మబోరని ఆయన అన్నారు. కాగా, పీసీసీ మాజీ చీఫ్ ఎం. సత్యనారాయణరావు సతీమణి సుగుణ మృతి పట్ల మహేషకుమార్‌గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.కాగా, పదేళ్ల పాలనలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దోచుకున్న డబ్బంతా కక్కాల్సిందేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపైన వినతిపత్రాలు స్వీకరించారు. మరోవైపు, మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన సభలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో తాము బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, బీఆర్‌ఎస్ దాన్ని 22 శాతానికి కుదించిందని ఆరోపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటున్నట్లు తెలిపారు. తన వల్లే బీసీ రిజర్వేషన్లు వచ్చాయంటున్న లిక్కర్ రాణి.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు.

# ఏఐతో.. ముప్పు!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ప్రస్తుతం ప్రపంచమంతా మాట్లాడుకుంటున్న సాంకేతికత. ఏఐతో కొత్త అవకాశాలు రావడమే కాదు.. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ఉద్యోగాలకు ముప్పు రానుందని అత్యధిక మంది నిపుణులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో నైపుణ్యాలను పెంచుకోవాలన్న కృతనిశ్చయం వారిలో కనిపిస్తోంది. మెషీన్ లెర్నింగ్, ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎక్కువ శాతం మంది భావిస్తున్నారని 'గ్రేట్ లెర్నింగ్' సర్వేలో తేలింది. సాంకేతికతతో తమ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని భావించే వారిలో 21 నుండి 28 సంవత్సరాల వయసు గల యువత (జనరేషన్ %–%జెడ్) అత్యధికంగా ఉండటం విశేషం. ముఖ్యంగా ఏఐ వల్ల తమ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని 74% మంది జెన్ %–%జెడ్ తరం భావిస్తున్నారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ఉద్యోగానికి ఢోకా లేదని 64 శాతం మంది ధీమాగా ఉన్నారు.
45%–%60 సంవత్సరాల వయసు గల జనరేషన్ %–%ఎక్స్‌లో 56% మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మొత్తంగా 69% మంది నిపుణులు తమ ఉద్యోగాలకు ఏఐ వల్ల ప్రమాదం ఉందని నమ్ముతున్నారు. 'అప్‌స్కిల్లింగ్ ట్రెండ్స్ రిపోర్ట్ 2025%–%26' పేరుతో ఎడ్‌టెక్ కంపెనీ 'గ్రేట్ లెర్నింగ్' దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 1,000 మందికిపైగా నిపుణులతో చేసిన సర్వేలో ఇలాంటి ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

**నైపుణ్యం పెంచుకుంటాం..**

ఈ సంవత్సరం నైపుణ్యాలను పెంచుకోవాలని 81% మంది భావిస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ సంఖ్య దేశంలోనే అత్యధికంగా 90 శాతం ఉంది. తమ కెరీర్‌లపై ఏఐ ప్రభావం సానుకూలంగా ఉంటుందని 78% మంది చెబుతున్నారు. ఈ ఏడాది 73% మంది నిపుణులు తమ ఉద్యోగాలను నిలుపుకోవడంపై నమ్మకంగా ఉన్నారు. 82% మంది చురుగ్గా కొత్త ఉద్యోగ అవకాశాలను అన్వేషిస్తున్నారు. ఇక 29%–%44 ఏళ్ల వయసున్న (మిలీనియల్స్) ఉద్యోగుల్లో 90 శాతం మంది నైపుణ్య విలువను గుర్తించారు. జెన్ %–%జెడ్




విషయంలో ఇది 79 శాతం. కానీ ఆఫీసు పని గంటల కారణంగా నూతన సాంకేతిక నైపుణ్యాలను సంపాదించడం అడ్డంకిగా మారిందని 37% మంది అంటున్నారు. కుటుంబ బాధ్యతలు, ఇంటి పని కారణంగా కొత్త కోర్సులు నేర్చుకోలేకపోతున్నామని 25 శాతం మహిళలు చెబుతుంటే.. ఇలా చెప్పిన పురుషులు 20 శాతం కావడం విశేషం.

**6 వారాల నుంచి ఆరు నెలలు..**

కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి జెన్ %–%ఏఐని ఉపయోగిస్తున్నట్లు 80% మంది నిపుణులు వెల్లడించారు. మెషీన్ లెర్నింగ్, ఏఐ విభాగాల్లో నైపుణ్యం పెంచుకుంటామని 44 శాతం మంది తెలిపారు. తమ పనిలో జెన్ %–%ఏఐని 'ఎల్లప్పుడూ' లేదా 'తరచుగా' ఉపయోగిస్తామని 60% మంది చెబుతున్నారు. ఇక ఐటీ, ఐటీఈఎస్, బీపీఎం, టెలికం రంగాల్లో పనిచేస్తున్నవారిలో 91 శాతం మంది నైపుణ్యం మెరుగుపర్చుకోవడం ముఖ్యం అని తెలిపారు. 64% మంది నిపుణులు 6 వారాల నుంచి 6 నెలల నిడివిగల ప్రోగ్రామ్స్‌తో నైపుణ్యాన్ని పెంచుకోవాలని అనుకుంటున్నారు.
జెన్ –జీ ప్రధానంగా స్వల్పకాలిక ప్రోగ్రామ్స్‌ను ఇష్టపడుతున్నారు. 50% మంది 6 వారాల కంటే తక్కువ లేదా 6 వారాల నుండి 3 నెలల మధ్య ఉన్న ప్రోగ్రామ్‌లను ఇష్టపడుతున్నారు. దేశీయ యూనివర్సిటీలు అందించే సర్టిఫికేట్ ప్రోగ్రామ్స్ చేస్తున్నామని 43 శాతం చెప్పగా.. అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేట్ ప్రోగ్రామ్స్ చేస్తున్నామని 36 శాతం తెలిపారు. తల్లి/తండ్రిగా బాధ్యతలు నెరవేరుస్తున్న ఉద్యోగుల్లో 90% మంది నిపుణులు నైపుణ్యం పెంపుదల ముఖ్యమైనదని భావిస్తున్నారు. ఇతర (పెళ్లికాని లేదా పిల్లలు లేనివారు) నిపుణుల్లో ఈ సంఖ్య 76 శాతమే.

# వ్యవస్థీకృతంగా మారిపోయిన వీసా మోసాలు

న్యూఢిల్లీ

ఉన్న ఊరిలో ఉపాధి లేక.. ఉన్నా సంపాదన సరిపోక.. ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారు ఎందరో. వారి ఆశలను సొమ్ము చేసుకుని, నకిలీ వీసాలతో వారి కలలను కల్లలు చేస్తున్న ముఠాలు పెరిగిపోయాయి. లక్షలకు లక్షలు వసూలు చేసి తప్పుడు, ఫోర్జరీ పత్రాలు, నకిలీ వీసాలతో విదేశాలకు పంపుతున్నాయి. ఉద్యోగాలపై ఆశతో వెళ్లినవారు అసలు విషయం తెలిసి గుండెలు బాదుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా వ్యవస్థీకృతంగా సాగుతున్నట్లు ఇటీవల బయటపడిన నకిలీ వీసా రాకెట్ బాగోతాల్లో వెలుగు చేసింది. మన దేశంలో హైదరాబాద్‌తోపాటు ముంబై, బెంగళూరు, సూరత్, గాంధీనగర్, ఢిల్లీలలో పలు ముఠాలు అధికారులకు పట్టుబడ్డాయి. ఈ ముఠాలు రూ.23 లక్షల నుంచి రూ.67 లక్షల వరకు వసూలు చేసి.. నకిలీ వీసాలు, స్పాన్సర్ ఐడీ, ఇతర అనుమతి పత్రాలను ఫోర్జరీ చేసి వందలాది మందిని గల్ఫ్, యూరప్ దేశాలకు పంపినట్టు వెల్లడైంది.

**పెరిగిపోతున్న వీసా మోసాలు**

ఈ ఏడాది మొదట్లో నకిలీ షెంజెన్ వీసా (29 యూరప్ దేశాల ఉమ్మడి వీసా)తో దుబాయ్ వెళుతున్న ఏడుగురిని ముంబై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో 'హైర్‌గ్లో ఎలిగాంట్ ఓవర్సీస్ ఇంటర్నేషనల్' అనే సంస్థ 300 మందిని ఫోర్జరీ స్పాన్సర్‌షిప్ పత్రాలతో మోసం చేసిన విషయం బయటికి వచ్చింది. ఢిల్లీలోని ఓ ముఠా గత ఐదేళ్లలో 5 వేలకుపైగా నకిలీ వీసాలు, ఫోర్జరీ పత్రాలతో రూ.300 కోట్ల మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి తప్పుడు వీసాలతో వందలాది మందిని గల్ఫ్ దేశాలకు పంపిన సంగతి గతంలోనే బయటపడింది. కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు, కొందరు ఏజెంట్లపై అమెరికా విదేశాంగ శాఖ నిషేధం విధించిందంటే.. ఈ ముఠాలు అంతర్జాతీయంగా ఎంత వ్యవస్థీకృతంగా విస్తరించాయో అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**రకరకాలుగా మభ్యపెట్టి..**

సాధారణంగా ఉద్యోగ వీసాల కోసం చాలా తతంగం ఉంటుంది. విదేశాల్లోని సంస్థలు, వ్యక్తులు సదరు




వ్యక్తికి తాము ఉద్యోగమిస్తామని స్పాన్సర్‌షిప్ పత్రాలు ఇవ్వాలి. ఆ తర్వాత వీసా కోసం దరఖాస్తు, విద్యార్హత, ఆరోగ్య ధ్రువీకరణ వంటి అవసరమైన పత్రాల సమర్పణ, సంబంధిత దేశ రాయబార కార్యాలయంలో ఇంటర్వ్యూ.. ఇలా ఎన్నో ఉంటాయి. ఇందుకోసం సమయం పడుతుంది. అయితే నకిలీ వీసా ముఠాలు.. తాము త్వరగా స్పాన్సర్‌షిప్ పత్రాలు, వీసాలు ఇప్పిస్తామంటూ గాలం వేస్తున్నాయి. వీటిలో చాలా వరకు ఎలాంటి లైసెన్స్ లేనివే. విదేశాలకు ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లాలనుకునేవారిని.. స్థానికంగా ఉండే మధ్యవర్తులు, ఏజెంట్ల సాయంతో గుర్తిస్తున్నాయి. ఫోర్జరీ స్పాన్సర్‌షిప్ పత్రాలతో పర్యాటక వీసాలపై విదేశాలకు పంపుతున్నాయి. అధికారులు కూడా క్షుణ్నంగా పరిశీలిస్తే తప్ప గుర్తించలేని స్థాయిలో ఈ నకిలీ పత్రాలు ఉంటుండటం గమనార్హం. కొన్నిసార్లు ఇక్కడే విమానం ఎక్కే ముందే నకిలీ, ఫోర్జరీ విషయం బయటపడుతోంది. ఇలాంటివారు లక్షలకు లక్షలు డబ్బులు పోగొట్టుకుని, పైగా ఉద్యోగం ఆశలు ఆవిరై ఆందోళనలో పడుతున్నారు.

**విదేశాల్లో కష్టాలు పడుతూ..**

నకిలీ వీసాలు, ఇతర పత్రాలతో వెళ్లినవారు విదేశాల్లో అధికారుల తనిఖీల్లో పట్టుబడి కష్టాల పాలవుతున్నారు. కేసులు, జైళ్ల పాలవుతున్నారు. కొన్నిసార్లు స్వదేశాలకు తిప్పిపంపేస్తున్నా.. మళ్లీ ఆ దేశంలోకి రాకుండా నిషే?ధం ఎదుర్కొంటున్నారు. ఇలా నకిలీ వీసాలు, పత్రాలతో విదేశాలకు పంపుతున్న ట్రావెల్ ఏజెన్సీలు, ఏజెంట్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా... మోసాలు మరింతగా పెరిగిపోతూనే ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. విదేశాంగ శాఖ నుంచి లైసెన్సు పొందిన సంస్థలు, ఏజెంట్ల ద్వారా వెళితే మోసపోకుండా ఉండవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయా దేశాలకు చెందిన అధికారిక వెబ్‌సైట్లలో వీసా ప్రక్రియ, స్పాన్సర్‌షిప్ విధానం, ఇతర అంశాలను పరిశీలించాలని సూచించింది.
మోసపోయినట్టు గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసింది

# ప్రజ్ఞానందా చరిత్ర

చెన్నై : అంతర్జాతీయ చెస్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. భారతీయ యువ గ్రాండ్ మాస్టర్ల చేతిలో వరుసగా ఓటమిపాలవుతూ వస్తున్నాడు. గ్రాండ్ చెస్ టూర్ 2025 జాగ్రెబ్ ఈవెంట్‌లో కార్ల్‌సన్‌ను గుకేశ్ చావు దెబ్బ కొట్టగా.. ఇప్పుడు లాస్ వేగాస్‌లో రమేశ్ బాబు ప్రజ్ఞానందా ఓడించాడు. భారతీయులు కొట్టిన ఈ దెబ్బలకు ఇక మాగ్నస్ కార్ల్‌సన్ ఏకంగా చెస్ నుంచి తప్పుకోవడమే మిగిలుందని కామెంటేటర్లు అనడం విశేషం.లాస్ వేగాస్ వేదికగా జరిగిన ఫ్రీ స్టయిల్ చెస్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ప్రపంచ నెంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను భారత గ్రాండ్ మాస్టర్ రమేశ్ బాబు ప్రజ్ఞానంద ఓడించాడు. 19 ఏళ్ల ప్రజ్ఞానందా ఐదు సార్లు ఛాంపియన్ అయిన కార్ల్‌సన్‌ను కేవలం 39 ఎత్తుల్లోనే ఓడించాడు. నార్వేకు చెందిన గ్రాండ్‌మాస్టర్ కార్ల్‌సన్ ఇటీవల భారత ప్రస్తుత ఛాంపియన్ డి.గుకేశ్ చేతుల్లో వరుస పరాభవాలను చవి చూశాడు.ఈ ఏడాది ఇప్పటికే మూడు టోర్నమెంట్లు గెలుచుకున్న ప్రజ్ఞానంద ఇప్పుడు కార్ల్‌సన్‌ను క్లాసికల్, రాపిడ్, బ్లిట్స్ మూడు ఫార్మాట్లలోనూ ఓడించాడు. కార్ల్‌సన్‌ను ఇలా మూడు ఫార్మాట్లలోనూ ఓడించిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద నిలవడం విశేషం. ఈ ఓటమితో పాటు మరో మ్యాచ్‌లో వెస్లీ సో చేతితోనూ ఓడిన కార్ల్‌సన్ ఈ ఈవెంట్‌ను బయటకు వెళ్లిపోయాడు.వైట్ గ్రూప్‌లో ఉన్న ప్రజ్ఞానంద మొదటగా అబ్దుసత్తోరోవ్‌తో జరిగిన మ్యాచ్‌లో డ్రా, తర్వాత అసాబాయేవా, కీమర్‌పై వరుస విజయాలు సాధించాడు. చివరగా కార్ల్‌సన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎత్తుగడలు వేస్తూ విజయం సాధించడమే కాకుండా 4.5 పాయింట్లతో గ్రూప్ టాప్‌లో నిలిచాడు.ఫ్రీ స్టయిల్ చెస్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రతి ఆటగాడికి పది నిమిషాల టైమ్ కంట్రోల్ ఉంటుంది. ప్రతి మూవ్‌కు పది సెకన్లు. రెండు గ్రూపులుగా విడిపోయి వైట్ అండ్ బ్లాక్‌లో ప్రతి ఒక్కరూ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో ఎనిమిది మంది ఆటగాళ్లతో ఆడాల్సి ఉంది. టాప్ 4లో నిలిచిన వారి మధ్య టైటిల్ పోరు సాగుతోంది. గురువారం క్వార్టర్ ఫైనల్స్ జరగనుండగా.. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రెండు లక్షల అమెరికా డాలర్లను బహుమతిగా అందజేయనున్నారు.

## జాతీయ ప్రయోజనాలే ముఖ్యం

న్యూఢిల్లీ

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ 'నాటో' సెక్రెటరీ జనరల్ మార్క్ రుట్టే చేసిన హెచ్చరికలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తిప్పికొట్టారు. జాతీయ ప్రయోజనాలు, మార్క్ అవసరాల ఆధారంగానే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. తమకు దేశ ప్రయోజనాలు, అవసరాలే ముఖ్యమని తేల్చిచెప్పారు. రష్యా చమురు విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించొద్దని నాటోకు సూచించారు. రణధీర్ జైశ్వాల్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మార్క్ రుట్టే హెచ్చరికలను నిశితంగా గమనిస్తున్నా మని చెప్పారు. భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ప్రజా ప్రయోజన కోణంలోనే ఉంటాయన్నారు. సుస్థిరమైన ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు చమురు లభించినప్పుడు కొనడం సాధారణమేనని వివరించారు. రష్యా నుంచి యూరప్ దేశాలు చమురు కొనుగోలు చేస్తున్నారని రణధీర్ జైశ్వాల్ పరోక్షంగా ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు కొనడం ఆపాలని, ఉక్రెయిన్‌పై యుద్ధం విరమించేలా రష్యాపై ఒత్తిడి పెంచాలని ఇండియా, చైనా, బ్రెజిల్‌కు మార్క్ రుట్టే సూచించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి ఈ మూడు దేశాలే అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్నాయి.

## ఫడణవీస్‌తో ఉద్ధవ్ భేటీ



ముంబై

మహారాష్ట్రలో రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయా? ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ బీజేపీతో కలవనున్నారా? అంటే తాజా పరిణామాలు అవుననే అనిపిస్తున్నాయి. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే గురువారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీసతో భేటీ అయ్యారు. విధాన మండలి చైర్మన్ రామ్ శిందే కార్యాలయంలో వీరిద్దరూ సమావేశం అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పక్షం వైపు రావాలంటూ ఉద్ధవ్‌ను ఫడణవీస్ ఆహ్వానించిన మరుసటి రోజే వీరిద్దరూ భేటీ కావడం గమనార్హం. బుధవారం మహారాష్ట్ర అసెంబ్లీలో సీఎం ఫడణవీస్ మాట్లాడుతూ.. "2029 వరకు మేం ప్రతిపక్షంలోకి వెళ్లే అవకాశం లేదు. కాబట్టి ఉద్ధవ్ జీ అధికార పక్షం వైపు వచ్చే అవకాశాన్ని పరిశీలించాలి" అని అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన స్నేహం 2014 వరకు అప్రతిహతంగా సాగింది. 25 ఏళ్ల పాటు కలిసి సాగిన ఈ రెండు పార్టీల మధ్య 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సందర్భంగా విభేదాలు వచ్చాయి. అనంతరం 2019 ఎన్నికల్లో గెలిచాక బీజేపీకి ఝలక్ ఇచ్చిన ఉద్ధవ్.. కాంగ్రెసతో చేతులు కలిపారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ఫడణవీస్.. ఉద్ధవ్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. 2022లో ఏక్‌నాథ్ శిందేతో తిరుగుబాటు చేయించి, శివసేనను చీల్చి.. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. శిందే రెండేళ్లకు పైగా మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన (శిందే) కూటమి రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేయడంతో ఫడణవీస్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలు విషయంలో కూటమి సర్కారుపై ఉద్ధవ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఫడణవీస్.. ఉద్ధవ్‌ను అధికార పక్షం వైపు రావాలని ఆహ్వానించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## బంగ్లాదేశ్‌లో పాక్ తాలిబన్ల నియామకాలు!

ఇంటర్నెట్‌డెస్క్




పాకిస్థాన్‌లో ఉగ్రదాడులకు పాల్పడుతున్న తెహ్రీకే ఈ తాలిబన్ పాకిస్థాన్ ఇప్పుడు తన కార్యకలాపాలను బంగ్లాదేశ్‌కు విస్తరించింది. ఈ విషయం భారత్‌కు ఇబ్బంది కరంగా మారే అవకాశం ఉంది. మరోవైపు ఢాకా పాలకులు మాత్రం ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇటీవల కాలంలో ఇద్దరు బంగ్లాదేశీలు పాక్ మీదుగా అఫ్గానిస్థాన్‌కు చేరుకొన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. వీరిలో ఒకరు వజీరిస్థాన్‌లో పాక్ సైన్యంతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. మరోవైపు అదే సమయంలో మిలిటెంట్ నెట్‌వర్క్‌లతో సంబంధాలున్న 36 మంది బంగ్లాదేశీయులను మలేసియాలో అరెస్టు చేశారు. హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత స్థానిక జిహాదీ గ్రూపులు బలపడుతున్న వేళ.. టీటీపీ ఇక్కడ చేరింది. జులైలో.. బంగ్లాదేశ్ యాంటీ టెర్రరిజమ్ స్క్వాడ్ షమిన్ మహఫుజ్, ఎండీ ఫైసల్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసింది. వీరికి టీటీపీతో సంబంధాలున్నాయని డెయిలీ స్టార్ పత్రిక పేర్కొం ది. ఇప్పటి వరకు కనీసం 8 మంది బంగ్లాదేశ్ వాసులు టీటీపీలో చురుగ్గా ఉన్నట్లు ఆ దేశ ఇంటెలిజెన్స్ గణాంకాలు చెబుతున్నాయి. గతంలో కూడా బంగ్లాదేశ్ వాసులు విదేశీ ఉగ్రసంస్థలతో సంబంధాలు పెట్టుకొన్నారు. 2016లో ఢాకాలో జరిగిన పేలుడులో 22 మంది చనిపోయారు.

అతడి చరిత్ర మొత్తం నేరమయం

జులై 14వ తేదీన బంగ్లా యాంటీ టెర్రర్ యూనిట్ షమాని మహఫుజ్‌ను నారాయణ్ గంజ్‌లో అరెస్టు చేసింది. అతడికి టీటీపీతో సంబంధాలు ఉన్నట్లుపేర్కొంది. గతంలో అతడు జమాత్‌ఉల్ ముజాహిద్దీన్ బంగ్లాదేశ్‌లో వ్యవస్థాపకుడు. ఆ తర్వాత జమాత్ ఉల్ అన్సారీ ఫిల్ హిందల్ షరాకియా అనే సంస్థను స్థాపించాడు.2014లో ఉగ్ర నియమాకాలు చేపట్టినం దుకు, 2023లో పేలుడు పదార్థాలు ఉన్నందుకు అతడిని అరెస్టు చేశారు. అతడిని 2024 అక్టోబర్‌లో బెయిల్‌పై విడుదల చేశారు. అతడికి కుకీ–చాన్ నేషనల్ ఫ్రంట్ నేత నాథన్ బోమ్‌తో సంబంధాలున్నాయి. దీనికి చిట్టగాంగ్ హిల్ ప్రాంతంలో ట్రైనింగ్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇక తాజాగా అరెస్టు అయిన ఎండీ ఫైసల్ అఫ్గానిస్థాన్‌కు వెళ్లి వచ్చాడు. ఇతడితోపాటు అహ్మద్ జుబైర్ అనే వ్యక్తి ఉన్నా.. అతడు పాక్ ఆర్మీ వజీరిస్థాన్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో చనిపోయాడు. వీరిని అఫ్గానిస్థాన్‌లోని ఏరోనాటికల్ ఇంజినీర్ ఇమ్రాన్ హైదర్ టీటీపీలో చేర్చుకొన్నాడు. బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారిని జిహాద్‌కు సిద్ధం చేయడంలో అతడిదే కీలక పాత్ర.

# విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు

తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేక విలక్షణ నటులు ఎస్వీ రంగారావు. రంగారావు తన నటనలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికా భినయాలు కలబోసిన నటుడు. సహజ నటుడిగా పేరు గాంచారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రిక, ఐతిహాసిక పాత్రలు ఏవైనా వాటిల్లో పరకాయ ప్రవేశం చేసి, అందరి మన్ననలు పొందిన మహానటులు యస్వీఆర్. నవరసాలను అలవోకగా అవలీలగా పాత్రల ద్వారా ఒలికించిగల అతికొద్ది మంది నటుల్లో ఎస్వీఆర్ ది అగ్రస్థానం. ఎస్వీ రంగారావు కృష్ణా జిల్లా లోని నూజివీడులో, 1918 జూలై 3 వ తేదీన జన్మించారు. మద్రాసు హిందూ హైస్కూలులో తన పదిహేనవ ఏట మొదటి సారిగా నాటకంలో నటించారు. తన నటనకు అందరి నుంచి ప్రశంసలు రావడంతో ఆయనలో నటుడు కావాలన్న కోరికకు బీజం పడింది. తర్వాత పాఠశాలలో ఏ నాటకం వేసినా ఏదో ఒక పాత్రలో నటించేవారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రవేశం ఉండేది. 1936 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలలో రంగారావు బళ్ళారి రాఘవ, గోవిందరాజు సుబ్బారావు లాంటి ప్రఖ్యాత నటులను చూసి తాను కూడా ఎలాగైనా నటుడు అవ్వాలనుకున్నారు. మద్రాసులో ఎక్కడ తెలుగు నాటకాలు జరుగుతున్నా హాజరయ్యేవారు. అన్ని భాషల సినిమాలు శ్రద్ధగా చూసేవారు. వాటిని విశ్లేషించేవారు. ఇంటర్ పరీక్షకు 45 మంది హాజరయితే అందులో రంగారావు ఒక్కడే ఉత్తీర్ణుడు కావడం విశేషం. రంగారావు కు మాత్రం నటుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాగా చదువుకుంటూనే నటనను కూడా వదిలి పెట్టలేదు. కాకినాడ లోని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ లో చేరి ఎన్నో నాటకాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఇక్కడ అంజలీదేవి, ఆదినారాయణ రావు, బి.ఎ.సుబ్బారావు, రేలంగి వంటి వారితో పరిచయం ఏర్పడింది. నాటకాల్లో రంగారావు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించారు. పీష్వా నారాయణరావు వధ నాటకంలో రంగారావు ఇరవై రెండేళ్ళ వయసులో అరవై ఏళ్ళ వృద్ధుని పాత్ర ధరించి మెప్పించారు. ఖిల్జీ రాజ్యపతననం నాటకంలో మాలిక్ కపూర్ పాత్రలో, స్ట్రీట్ సింగర్ నాటకంలో విలన్ పాత్ర మొదలైన పాత్రలు పోషించారు. రంగారావు కు ఇంగ్లీషు మీద కూడా పట్టు ఉండటంతో షేక్స్పియర్ నాటకాల్లోని సీజర్, ఆంటోనీ, షైలాక్ లాంటి పాత్రలు పోషించేవారు. నాటకాలు వేస్తూనే బి. ఎస్. సి పూర్తి చేశారు. మొదట బందరు లో తర్వాత విజయ నగరంలో ఫైర్ ఆఫీసరు గా పనిచేశారు. ఈ ఉద్యోగంలో రంగారావుకు పెద్దగా పని ఉండేది కాదు. కానీ ఉద్యోగ స్వభావ రీత్యా ఖాళీ సమయాల్లో నటించడానికి వీలులేదు. తాను కళకు దూరం అవుతున్నేనేమో నని భావించిన రంగారావు ఆ ఉద్యోగం నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నటించిన మొట్టమొదటి చిత్రం 1946లో వచ్చిన వరూధిని అనే చిత్రం. తొలి సినిమాలో పాత్ర పోషించినందుకు గాను రూ.750



పారితోషికంగా అందుకున్నారు. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన మనదేశం, పి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన తిరుగుబాటు చిత్రంలో కూడా అంతగా ప్రాధాన్యం లేని పాత్రలే వచ్చాయి. అయినా రంగారావు నిరుత్సాహ పడకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూడ సాగారు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయా ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలిసారిగా నిర్మించిన షావుకారు సినిమాలో సున్నపు రంగడు అనే కీలకమైన పాత్రను రంగారావు కిచ్చారు. ఈ సంస్థలో ప్రవేశించడం రంగారావు కెరీర్ కు గట్టి పునాది పడింది. తర్వాత అదే సంస్థ నిర్మించిన పాతాళ భైరవి (1951) సినిమాలో అతి ముఖ్యమైన మాంత్రికుడి పాత్రను రంగారావు కిచ్చారు. పరభాషా సినిమాలు కూడా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. హిందీ భాషలో ప్రవేశమున్న రంగారావు తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. భానుమతి దర్శక నిర్మాత వచ్చిన నాది ఆడజన్మే ఆధారంగా హిందీలో తీసిన మై భీ లడ్కీ హూ లాంటి హిందీ చిత్రాల్లో నటించారు. భూకైలాస్, మాయాబజార్ లాంటి కన్నడ చిత్రాలలోనూ, విదయాగలే ఎతిలే ఎతిలే, కవిత వంటి మలయాళ చిత్రాలలో కూడా నటించారు. నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఎస్వీయార్ నటించిన నర్తనశాల ఇండొనేషియా లోని జకార్తాలో ఆఫ్రో–ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవము?లో ప్రదర్శించ బడడమే కాకుండా కీచకపాత్రకు గాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథా నాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రెండో ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం లభించింది. రెండో చిత్రం బాంధవ్యాలు ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం అందుకున్నది. మొదటి సినిమా వైఫల్యం తర్వాత రంగారావు జంషెడ్పూర్ లో టాటా కంపెనీలో ఉద్యోగం లో చేరారు. ఇదే సమయంలో ఆయన మేనమామ బడేటి వెంకట రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె లీలావతిని 1947 డిసెంబరు 27న వివాహం చేసుకున్నారు. వ్యక్తిగా రంగారావు చమత్కారి, సహృదయుడు. సినిమా సెట్స్ మీద గంభీరంగా ఉండేవారు. వ్యక్తిగత విషయాలు సహనటులతో చర్చించడానికి ఇష్టపడేవారు కాదు. ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజూ శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవారు. యస్వీఆర్ ఒక వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. తానే స్వయంగా కొన్ని రచనలు కూడా చేశారు. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చారు. చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు. తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ నిధికి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, పాలకొల్లు, సామర్లకోట, పెనుగొండ, అనకాపల్లి లాంటి ఊర్లలో ఆయనకు సన్మానాలు జరిగాయి. జకార్తాలో పురస్కారం అందుకుని మద్రాసు వచ్చాక మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ , ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు సంఘం , దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య మండలి, మద్రాసు సినిమా ప్రేక్షక సంఘాలు ఘనంగా సన్మానించారు. అన్నై, శారద, నానుం ఒరుపెణ్, కర్పగం, నర్తనశాల సినిమాలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పారితోషికం స్వీకరించారు. విశ్వనటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ, నటశేఖర తదితర బిరుదులు పొందారు. రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చదరంగం ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం బాంధవ్యాలు తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి. నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాళాబిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది. రంగారావుకు తొలినాళ్ళలో మంచి పేరు తెచ్చిన షావుకారు చిత్రంలోని సున్నం రంగడి పాత్ర కోసం తన స్వగ్రామంలో కోడి రంగడు అనే రౌడీని మనసులో పెట్టుకుని అతని మాట తీరుని, ప్రవర్తనా విధానాన్ని అనుకరించారు. సంతానం చిత్రంలో ఆయన పోషించిన గుడ్డివాని పాత్ర కోసం కొన్నాళ్ళు పాటు అంధుల ప్రవర్తనను గమనించారు. మాంత్రికుడి పాత్ర కూడా తాను ఆంగ్ల నాటకాల్లో ధరించిన షైలాక్ పాత్రలను ఆధారంగా చేసుకుని మరింత రౌద్రరసాన్ని కలిపి తనదైన శైలిలో నటించారు. రంగారావు యముడి పాత్ర పోషించిన సతీ సావిత్రి సినిమా మద్రాసులో జెమినీ స్టూడియోలో చిత్రీకరణ జరుగుతుండగా మద్రాసు పర్యటనకు వచ్చిన చైనా ప్రధాని చౌ ఎన్ లై ఈయన నటనను అభినందించారు. జులై 3, 2018న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏలూరులో పన్నెండున్నర అడుగుల ఎత్తైన రంగారావు కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1974 జూలై 18వ తేదీన మద్రాసులో కన్ను మూశారు.

# సామాజిక మార్పుకు సాధనం సాహిత్యం

రెంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920 –18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాద కుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ



స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

## ఆఫ్రికాలో ఉద్యమించిన నల్లసూర్యుడు

దక్షిణ ఆఫ్రికా జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడు, న్యాయవాది, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సి) నాయకుడు, దాణశీలి, ప్రజాసేవకుడు, ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వంలో తొలి నల్లజాతి దేశాధ్యక్షుడు (1994–99), 27 ఏండ్ల పాటు జైలు జీవితం అనుభవించిన అవిశ్రాంత నల్లజాతి ప్రతినిధి అయిన నెల్సన్ మండేలా పుట్టిన రోజు (18 జూలై 1918) సందర్భంగా ఐరాస చొరవతో ప్రతి ఏట 18 జూలై రోజున "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ నెల్సన్ మండేలా"ను పాటించడం 18 జూలై 2010 నుంచి ప్రారంభం అయ్యింది. దక్షిణ ఆఫ్రికాలోని "మ్వోజో" గ్రామంలోని "తెంబూ రాయల్" కుటుంబంలో జన్మించిన మండేలా వంశంలో తొలి విద్యావేత్తగా పోర్ట్‌హేర్, విట్‌వాటర్స్రాండ్ యూనివర్సిటీల్లో బిఏ, న్యాయ పట్టాలు పొంది ఉన్నత విద్యావేత్తగా పేరు తెచ్చుకొని, లాయర్‌లా పని చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు తన పేరు ముందు నెల్సన్‌ను చేర్చడంతో నెల్సన్ మండేలా అనే పేరు ఖ్యాతిలోకి వచ్చింది. 1943లో వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాలు ప్రారంభించిన మండేలా ఏఎన్‌సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. వర్ణ వివక్ష పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో అరెస్టు కూడా అయ్యారు. ఇదే క్రమంలో మర్క్సిజం వైపు ఆకర్షితులై దక్షిణ ఆఫ్రికా కమ్యూనిస్టు పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలు చేశారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ "ఉమ్కోంటో వీ స్విజ్వే" అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. నాటి శ్వేత జాతి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ, 12 జూన్ 1963 రోజున యావజ్జీవ కారాగార శిక్షను విధించడంతో 27 ఏండ్ల పాటు సుదీర్ఘ జైలు జీవితం అనుభవిస్తూ అంతర్జాతీయ మానవాళి దృష్టిని ఆకర్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన నాటి ప్రభుత్వం 11 ఫిబ్రవరి 1990న విడుదల చేసింది. జైలులో 466 గదిలో బంధించబడి 63 (1963)లో విడుదల కావడంతో 46663ని మండేలా సంఖ్యగా పిలవబడం జరుగుతోంది. విడుదల అనంతరం నాటి శ్వేతజాతి ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా 1994లో నిర్వహించిన ఎన్నికల్లో ఏఎన్‌సి పార్టీ నేతృత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో నల్లజాతికి చెందిన తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారు. వర్ణ వివక్షను రూపుమాపే కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. భూసంస్కరణలు, పేదరిక నిర్మూలన, స్వపరిపాలనలకు పట్టం కట్టిన మండేలా నల్లజాతి ఉద్ధారకుడిగా చరిత్రలో నిలిచిపోయారు.

# ప్రకంపనలు సృష్టిస్తున్న పదవీవిరమణ

బిజెపిలో 75 ఏళ్లకు అన్ని అధికార, పార్టీ పదవుల నుండి నిష్క్రమించాలనే నిర్దుష్టమైన నిబంధన ఏమీ లేనప్పటికీ ఈ అంశం ఇప్పుడు ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత డా. మోహన్ భగవత్ గత వారం మరో సందర్భంలో సీనియర్ సంఘ్ నేత మోరోపంత్ పింగ్లేపై రాసిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఆయన అన్నమాటలను ఉటంకించడంతో పరోక్షంగా బిజెపి నాయకులకు ఆయన సందేశం ఇచ్చారనే కథనాలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాలను, రాజకీయ నాయకులను దృష్టిలో ఉంచుకొని ఆ విధమైన మాటలు చెప్పలేదని అంటూ ఆ తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ వివరణ ఇవ్వడం గమనిస్తే ఆయన ప్రకటన రాజకీయంగా ఎంతటి కలకలం రేపిందో వెల్లడి చేస్తున్నది. అయితే, ఆయన ప్రకటన కన్నా ముందే రోజే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన రాజకీయ రంగ నిష్క్రమణ గురించి ప్రస్తావించడం కూడా ఈ కలకలంకు ఆజ్యం పోసింది. ఇదంతా మరో రెండునెలల్లో ప్రధాని నరేంద్ర మోడీ 75 ఏళ్ళ వయస్సుకు రాజకీయ ప్రకంపనలకు దారితీస్తున్నది. దానితో తాను ఏర్పర్చిన ఈ నిబంధనను ప్రధాని తాను ఏమేరకు పాటిస్తారో అన్న ఆసక్తి అన్ని వర్గాలలో సహజంగానే నెలకొంటుంది. 2015లో ప్రధాని పదవి చేపట్టగానే (%ఖుంంబఎఆఅస్త్ర శీటటఆఎవ ౡతీఆఎవ వీఆఅఆర్‌వతీ%) పార్టీ ప్రారంభంనుండి కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్న ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, శాంత కుమార్ వంటి వారికి కనీసం పార్టీ పార్లమెంటరీ బోర్డులో కూడా స్థానం లేకుండా చేయడంతో అనధికారికంగా అటువంటి నిబంధన పార్టీలో అమలు చేయడం ప్రారంభించారు. 'మార్గదర్శకులు' అంటూ వారికి ఓ హోదాను కట్టబెట్టినప్పటికీ అటువంటి వారితో ఇప్పటి వరకు ఒక సమావేశం కూడా జరపకపోవడం గమనార్హం. అప్పటినుండి అనేకమంది నాయకులను గవర్నర్లు, మంత్రులు, పార్టీ పదవులనుండి ఈ నిబంధన పేరుతో తొలగిస్తూ వస్తున్నప్పటికీ రాజకీయ అవసరాలకోసం 80 ఏళ్ళు పైబడిన వారికి సైతం ఎన్నికలలో సీట్లు ఇవ్వడం, నామినేట్ పదవులు ఇవ్వడం చేస్తూనే ఉన్నారు. అయితే, ఇప్పుడు అమిత్ షా తన రాజకీయ నిష్క్రమణ గురించి ఎందుకు ప్రస్తావించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఆయన మరో 15 ఏళ్లకు గాని 75 ఏళ్ళ పరిధికి చేరుకోరు. రాజకీయాల నుండి నిష్క్రమిస్తే తాను వేదాలు, ఉపనిషత్తులు చదువుకుంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ గడుపుతానని చెప్పడం ద్వారా చివరికంటా పదవులను పట్టుకొనే వేలాడననే సంకేతం ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఆయన వ్యవసాయం చేస్తారని ఎవ్వరూ విశ్వసించే పరిస్థితి లేదు. కేవలం ఓ రాజకీయ ఎత్తుగడగా ఈ ప్రకటన చేశారని స్పష్టం అవుతుంది. నేటి జాతీయ నాయకులలో వ్యక్తిగత విషయాలపై బహిరంగంగా ఎప్పుడూ మాట్లాడని నాయకుడు అమిత్ షా. కేవలం ఈ మధ్య ఒకసారి తన ఇద్దరు మనవరాళ్లతో కలిసి ఉన్న ఫోటోను పంచుకున్నారు. కుటుంబ విషయాలను మీడియావారు ప్రస్తావించినా నిర్మోహమాటంగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరిస్తారు. అటువంటిది ఈ విషయం గురించి ప్రసావించడం సహజంగానే రాజకీయంగా ఆసక్తి కలిగిస్తుంది. ఆయన ఈ ప్రకటన మహిళా బృందాలతో మాట్లాడుతున్నప్పుడు చేశారు. సహకార మంత్రిగా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నట్లు చెబుతూ వారికి నేరుగా వారి బ్యాంకు అకౌంటులలో చెల్లింపులు జరిగేటట్లు చూడటమే తన అభిలాష అని చెప్పారు. అయితే, ఈ లక్ష్యం నెరవేరేందుకు ఓ పదేళ్లు పట్టవచ్చని చెప్పడం ద్వారా మరో పదేళ్లు అధికారంలో కొనసాగుతానని సంకేతం ఇదే సమయంలో ఇచ్చారు. బిజెపి అధ్యక్ష ఎన్నిక విషయంలో ప్రతిష్టంభన నెలకొనడంతో ఆయన కొంత అసహనంగా ఉన్నారనే ప్రచారం జరుగుతుంది. గత 11 ఏళ్లుగా పార్టీ వ్యవహారాలు అన్ని ఆయన కనుసన్నలలో జరుగుతున్నాయి. తన తర్వాత ఐదున్నరేళ్లుగా జెపి నడ్డా అధ్యకునిగా ఉంటున్నప్పటికీ మొత్తం అధికారం అమిత్ షా చేతుల్లోనే కొనసాగుతున్నది. పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాలు ఆయన అభీష్టం మేరకే జరుగుతున్నాయి. అందుకనే నడ్డా వారసునిగా సహజంగా తాను ఎంపిక చేసేవారే ఉండాలని కోరుకుంటారు. కానీ, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో బిజెపి ఎంతో ఎదిగిందని, ఇంకా తమకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు అవసరం లేదని, సొంతంగా తమ వ్యవహారాలు చక్కబెట్టుకోగలమని చెప్పడం ద్వారా నడ్డా పార్టీకి ఎంతో నష్టం కలిగించారు. ఆయన మాటల ప్రభావమో, మరేమిటో గాని 400 సీట్లు గెలుస్తామని ప్రచారం చేసుకుంటే సొంతంగా మెజారిటీ కూడా లేకుండా 240 సీట్లకు పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రతిష్ఠాకరంగా పనిచేయడంతోనే ఓటమి నుండి బిజెపి విజయంవైపు ప్రయాణం చేయగలిగింది. పైగా, ప్రధాని మోడీ ప్రచారంతో మాత్రమే ఓట్లు పొందే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. అందుకనే ఆర్‌ఎస్‌ఎస్ సూచనలను కాదని పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటే రాబోయే రోజులలో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనే భయం పార్టీ వర్గాలలో ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ సైతం పార్టీ అధ్యక్ష పదవికి ఓ నిర్దిష్టమైన పేరు సూచింపకుండా, ఓ బృందంగా పనిచేస్తూ, పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచే వారిని ఎనుకోవాలని మాత్రమే చెబుతున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి మధ్య ఏకాభిప్రాయం ఏర్పడటంలేదని చెబుతున్నారు. ఓ విధంగా మొత్తం పార్టీ వ్యవస్థను ఈ మధ్య కాలంలో తలాకుతలం కావించారు. విధానపరమైన విషయాలపై పార్టీలో చర్చలు జరగడంలేదు. ఎక్కువగా సోషల్ మీడియాపై, ప్రచార వ్యూహాలపై దృష్టి సారిస్తున్నారు. జెపి నడ్డా పదవీకాలం జనవరి, 2023లోనే అయిపోయింది. అప్పటినుండి ఏదో ఒక సాకుతో ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ మరో అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతున్నారు. బిజెపి అధ్యక్షుడి పదవీకాలం మూడేళ్లు మాత్రమే. కానీ 2014 నుండి అమిత్ షా, ఆ తర్వాత జెపి నడ్డా మాత్రమే అధ్యక్షులుగా ఉన్నారు. పార్టీ నిబంధనల మేరకు ఈ పాటికి నాలుగో అధ్యక్షుడు ఉండాల్సి ఉంది. గతంలో బిజెపి నాయకత్వంలో ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ సంస్థాగత వ్యవహారాలు క్రమబద్ధంగా జరుగుతూ ఉండెడివి. ప్రతి ఏడాది రెండు సార్లు జాతీయ మండలి సమావేశాలు, మరో రెండు సార్లు జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుపుతూ ఉండేవారు. కానీ ఇప్పుడు చాలా అరుదుగా సమావేశాలు జరుపుతున్నారు. చివరకు 2024 పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు బిజెపి ఎంపిల సమావేశాలే జరపడం లేదు. ప్రజాస్వామ్య సంప్రదాయం ప్రకారం కూటమి ప్రభుత్వం ఉంటే, కూటమిలో పెద్ద పార్టీ ఎంపిలు ముందుగా తమ నాయకుడిని ఎన్నుకొని, ఆ నాయకుడికి ఇతర మిత్రపక్షాల మద్దతు తీసుకొనేవారు. కానీ, ఆశ్చర్యకరంగా 2024 ఎన్నికల అనంతరం ఎన్‌డిఎ ఎంపిల సమావేశం జరిపే, అందులో నరేంద్ర మోడీని నాయకునిగా ఎన్నుకున్నారు. అంతకు ముందు పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రతి వారం బిజెపి ఎంపిలు సమావేశమై సమావేశాల తీరుతెన్నులు, వ్యూహాలపై చర్చించేవారు. కానీ ఇప్పుడు ఎన్‌డిఎ ఎంపిల సమావేశాలు జరుగుతున్నాయి గాని, విడిగా బిజెపి ఎంపిల సమావేశాలు జరపడం లేదు. పార్టీ ఎంపీల సమావేశాలు జరిగితే విధానపరమైన అంశాలపై నేతలను ప్రశ్నించేందుకు కనీసం 50 మంది ఎంపీలు సిద్ధంగా ఉన్నారని, అందుకనే దాటవేస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఏదిఏమైనా ప్రధాని మోడీ 75 ఏళ్ళు రాగానే రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఇప్పటికే అమిత్ షా, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి నేతలు స్పష్టం చేశారు. 2024 ఎన్నికలలో ఆయనను ఐదేళ్లపాటు ఎన్నుకున్నారని, అందుకనే 2029 వరకు ఆయనే కొనసాగుతారని నిషికాంత్ దూబే వంటి వారు స్పష్టం చేస్తున్నారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్‌లో కొంతకాలంగా ఈ నిబంధనను పాటిస్తూవస్తున్నారు. ఇప్పుడు మోడీ కూడా పాటించాలని కోరుకోవడం సహజమే కాగలదు. ఆ మేరకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అందుకనే ఈ అంశం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యత సంతరింప చేసుకుంటుంది. ఒక వంక ప్రధాని మారి, పార్టీకి కొత్త అధ్యక్షుడు కూడా వస్తే మొత్తం పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. అందుకనే సహజంగానే ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తున్నవారు అటువంటి మార్పును స్వాగతిపలేరు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తుంది

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు**

బీబీనగర్,జూలై 17( ప్రభాత సూర్య):

ఈనెల 23, 24 తేదీలలో బీబీనగర్ మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు తెలిపారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయకుండా దాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం అన్ని పత్రికలలో ప్రధానంగా వచ్చిన వార్త ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను రెండుసార్లు ఫోటో తీసి ఆన్లైన్లో పంపితేనే కూలీలకు డబ్బులు ఇస్తామని చెప్పడం చాలా దారుణమని అన్నారు. అనేక ప్రాంతాలలో సిగ్నల్ రాక ఇబ్బందులు ఉన్నాయని మరి అలాంటి పరిస్థితులలో కూలీల పరిస్థితి ఏమి కావాలని ప్రశ్నించారు. చట్టంలో ఉన్న ప్రకారం పని చేసిన వారికి వారం వారం డబ్బులు ఇవ్వాలని ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని చెప్తుంటే మోడీ మాత్రం బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ చట్టానికి కొత్త కొత్త జీవోలు తెచ్చి ఉపాధి హామీకి తూట్లు పొడుస్తున్నాడని విమర్శించారు. ఉపాధి రక్షణ కోసం తీసుకోబోయే కార్యక్రమం గురించి సమావేశంలో చర్చించబోతున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 71 కేంద్రాల్లో ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకొని లక్ష మందికి




పైగా జీవిస్తున్నారని వారందరికీ ఇంటి స్థలం పట్టాయి ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం గుర్తించిన మిగులు భూములు లక్షకు పైగా ఎకరాలు ఉన్నాయని వాటన్నింటినీ భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చి రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులను అందించాలని సూచించారు. పెరుగుతున్న ధరలు కనుగుణంగా వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేసి రోజు కూలీ 800కు పైగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీబీనగర్ లో నిర్వహిస్తున్న రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఉపాధి హామీ, ఇండ్ల స్థలాలు, ప్రభుత్వ మిగులు భూములు, ప్రజా పంపిణీ వ్యవస్థ గురించి చర్చించి ఉద్యమాలను రూపొందిస్తామని తెలియజేశారు. ఈ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పాల్గొంటున్నారని తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలి

చౌటుప్పల్.జులై 17. ప్రభాత సూర్య

యాదాద్రి భువనగిరిజిల్లా చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభ ఈనెల 22న జరుగుతుందని ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని వి హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బర్రె శంకర్ పిలుపునిచ్చారు. గురువారం చౌటుప్పల్ మండల ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి, విహెచ్పిఎస్ నాయకుల సమావేశంను ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, వీహెచ్పీఎస్ రాష్ట్ర నాయకులు బర్రె శంకర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ... వికలాంగుల పెన్షన్ రూ 6000 కు పెంచాలని , వృద్దులు వితంతువులు ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికుల పెన్షన్ రూ 4000 కు పెంచాలన్నారు. అలాగే పూర్తి స్థాయి కండరాల క్షీణత కలిగిన్ వారికి రూ 15000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 13 న నిర్వహించబోయే ఛలో హైదరాబాద్ విజయవంతం చేయడానికై ఈ నెల 22న యాదాద్రి భువనగిరి జిల్లా సన్నాహక సభను భువనగిరిలో గార్డెన్ లో



నిర్వహించడం జరుగుతుందని ఈ సభకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ఎర్ర వీరన్న, వి హెచ్ పి ఎస్ చౌటుప్పల్ మండల ఉపాధ్యక్షులు సాయిరెడ్డి రామ్ రెడ్డి, బొబ్బిళ్ళ అలివేలు, మండల ప్రచార కార్యదర్శి మారగోని అంజయ్య, గడ్డం ప్రభాకర్, జాల లింగస్వామి,రత్నం అనిల్ కుమార్, ఎమ్మార్పీఎస్ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్ర శంకర్,మండల ఉపాధ్యక్షులు చీమకండ్ల శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర గౌతం, తాళసింగారం ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కిరణ్,దేవలమ్మ నాగారం గ్రామ శాఖ అధ్యక్షులు కుంటి గణేష్, బర్రె సంపత్ లు పాల్గొన్నారు.

# బాల్యంపై పుస్తకాల భారం?

**పెరుగుతున్న బడి పుస్తకాల బరువు**

**కిలోల కొద్ది బరువును విద్యార్థుల వీపునకు తగిలిస్తున్న వైనం**

**విద్యార్థులకు తప్పని తిప్పలు**

**బరువుకు మించిన బడి సంచి**

**అమలు కానీ నో బ్యాగ్ డే**

**సంస్థాన్ నారాయణపురం, జూలై 17( ప్రభాత సూర్య)** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒత్తిడితో కూడిన విద్య బోధనతో విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారు. నూతన విద్యా విధానం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులపై మళ్ళీ బ్యాగు భారం మొదలైంది. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో పుస్తకాల భారం విద్యార్థులకు శాపంగా మారుతుంది. ఏటా పై చదువుకు వెళ్తుంటే పుస్తకాల సంఖ్య కూడా పెరుగుతుంది. ప్రైవేటు స్కూల్ లలో పిల్లలు బ్యాగు నిండా పుస్తకాలతో నాలుగు ఐదు అంతస్తులు మెట్లు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఫలితంగా పట్టుమని 15 ఏళ్లు నిండకముందే చాలామంది నడుము. మెడ నొప్పి కండరాల సమస్యతో సతమతమవుతున్నారు. విద్యార్థులకు గుణాత్మక నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని విద్యాహక్కు చట్టం చెబుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు యాజమాన్యం పట్టించుకున్న పాపాన పోలేదు. పుస్తకాల బరువును తగ్గించాలని 2006లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన వాటిని అమలు చేయడం లేదు. దీనితో విద్యార్థులు అవస్థలు పడుతూనే ఉన్నారు. మరోవైపు పిల్లలపై పుస్తకాల భారం వలన వారి శారీరక మానసిక ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం పడుతుంది. పాఠశాల




బ్యాగుల బరువు తరగతి గదిలో అవసరమయ్యే పుస్తకాలు, ఇంటి వద్ద చదవాల్సిన హోంవర్క్, పుస్తకాల పరిమాణం అన్ని కలిపి పిల్లల పై అధిక భారాన్ని పెంచుతున్నాయి. అవసరం ఉన్నా లేకున్నా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్ది బరువును విద్యార్థులు వైపునకు తగిలిస్తున్నారు. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు ఇటు పాఠశాల యాజమాన్యాలు పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు. దీంతో పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపంగా మారుతుంది. పాఠశాలలు పుస్తకాల సంఖ్య తగ్గించాలి అవసరమైన పుస్తకాలు మాత్రమే అందించాలి అనే డిమాండ్లు మాత్రం వినిపిస్తున్నాయి విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గేదెలా అంటూ ఆయా పాఠశాలల్లో ర్యాక్స్ ఏర్పాటు చేస్తూ పాఠ్యపుస్తకాలు అన్ని పాఠశాలల్లోనే ఉంచుతూ హోంవర్క్ పుస్తకాలు మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని విద్యావంతులు మేధావులు ప్రజాసంఘాలు నాయకులు కోరుతున్నారు పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా విద్యాబోధన ఉండాలని ఆ విషయంలో పాఠశాలల, యజమాన్యాలు, అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

## డి నాగారంలో విద్యార్థులకు ఉచిత ఈఎన్‌టి వైద్య పరీక్షలు




చౌటుప్పల్.జులై 17. ప్రభాత సూర్య:

యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ మండలం,దేవాలమ్మా నాగారం గ్రామంలోని మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల్లో చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు ఆధ్వర్యంలో ఆశ్రయ్ ఆకృతి సంస్థ - కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించిన ఈ. ఎన్.టి,హియరింగ్, ఇతర వైకల్య స్క్రీనింగ్ వంటి పరీక్షలు విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఈ అవగాహన ప్రోగ్రామ్ ను క్వాల్కమ్ సహకారం తో క్యాంపులు నిర్వహించి మైనపుతో సమస్యను గుర్తించబడిన విద్యార్థులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఈ గురువారావు, ప్రధానోపాధ్యాయులు నరసింహ, డాక్టర్ దివ్య, ఈ.ఎన్.టి స్పెషలిస్ట్ నరేష్, ఆడియోలాజిట్ మహేష్, మల్టీ డిసిప్లినరీ రెహాబ్ స్పెషలిస్ట్, ఆశ్రయ్ ఆకృతి బృందం ఈ శిబిరంలో పాల్గొన్నారు.

## ట్రినీటిలో ఘనంగా ఎమోజీ దినోత్సవం




చౌటుప్పల్.జులై 17. ప్రభాత సూర్య:

చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని ట్రినీటి పాఠశాలలో గురువారం ప్రపంచ ఎమోజీ దినం సందర్భంగా త్రినిటీ విద్యాసంస్థలలోని అప్పర్ కేజీ విద్యార్థినీ విద్యార్థులకు ఆహ భావాలు ఏ విధంగా ముఖ కావలికలతో తెలుపాలో ఉపాధ్యాయులు నేర్పించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల మాట్లాడుతూ... ఎమోజి అనగా సంక్షిప్తంగా మన భావాలను ఎదుటి వారికి తెలుపడాన్నే ఎమోజి అంటారని విద్యార్థులకు తెలిపారు. ముఖ కవళికలలో ఆహాభావాలను,భావోద్వే గాలను నేర్చుకొని తెల్పడంలో ఉన్న సంతోషాన్ని చిన్నారి విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు చిరునవ్వు, వేడుకల సంబరాలు,ఆనంద భాష్పాలు,పగలబడి నవ్వడం,విచారం,బాధ నోరు మెదపకపోవడం,కోపం,చిరాకు,ఆలోచించడం,ఏడవడం, బిగ్గరగా ఏడవడం, రుచిగా ఉందని తెలపడం,సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కడం, నిద్రపోవడం,చిలిపితనం సిగ్గు పడడం లాంటి నవరస భావాలను ముఖ కవళికలతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ కేవీ బిక్కుష్ణారావు, ఉపాధ్యాయులు లోవకుమారి,పూజిత,సుమలత,భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సహకారంతో..... మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత




సంస్థాన్ నారాయణపురం, జూలై 17( ప్రభాత సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన క్రిష్టం పార్వతమ్మ కొద్దిరోజుల క్రితం మరణించగా నిరుపేద కుటుంబం కావడంతో గురువారం వారి దశదినకర్మ కార్యక్రమం సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సహకారంతో గ్రామ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మృతురాలి కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం,నాయకులు పాశం కృష్ణ,రాసాల వేంకటేష్,గుండమల్ల సతీష్ ,శికిలమెట్ల ప్రభాకర్,ఉప్పల ఆంజనేయులు,చిలువేరు ముత్యాలు,జక్కిడి యాదిరెడ్డి, మందుగుల సాయి కిరణ్ ,చిలువేరు కృష్టయ్య, బోయ కుల సంఘ పెద్దలు బోయిని ఎట్టయ్య, గుజ్జుల మునయ్య, భూపని సంజీవులు, భూపని నరసింహ, భూపని రాములు,భూపని మల్లేష్, క్రిష్టం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి మైక్రోసాఫ్ట్...

**విజయవాడ :** ఏపీకి గుడ్ న్యూస్. మరో దిగ్గజ పరిశ్రమ ఏపీకి రానుంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్ అమరావతి క్వాంటం వ్యాలీకి వస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ పసరత్తు ప్రారంభించింది. క్వాంటం కంప్యూటర్ తీసుకురానుంది. ఇందుకు సంబంధించి అధికారులతో చర్చలు కూడా జరిగాయి. త్వరలో ఏపీ ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఎంవోయూ కుదరనుంది. ఇప్పటికే ఐబీఎం 156 క్యూబిట్ల సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఐబీఎం బాటలోనే మైక్రోసాఫ్ట్ నడవనుంది. ఐబీఎం సంస్థ క్వాంటం కంప్యూటర్ కు భిన్నంగా మైక్రోసాఫ్ట్ మరో క్వాంటం కంప్యూటర్ ఉండనుంది. సాంకేతికంగా అత్యున్నతంగా క్వాంటం కంప్యూటర్లుసేవలందించనున్నాయి. వీటిలో సూపర్ కండక్టింగ్, ట్రాప్డ అయాన్, పోటానిక్, టోపో లాజికల్, న్యూట్రల్ ఆటమ్ లు ఉన్నాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీలో మైక్రోసాఫ్ట్ కొత్త భవనం కట్టనుంది. ఇది నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అయితే ఈ భవనం మైక్రోసాఫ్ట్ కడుతుందా? ప్రభుత్వం కట్టి ఇస్తుందా అన్నది తెలియడం లేదు. ఎంవోయూ సమయంలో దీనిపై స్పష్టత రానుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఖమ్మంలో భారీ ప్రదర్శన






**-అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం**

ఖమ్మం( సూర్య ప్రతినిధి)

ఖమ్మం మయూరి సెంటర్ అమరవీరుల స్థూపం దగ్గర నుండి తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శనను ప్లే కార్డ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేసుకుంటూ జడ్పీ సెంటర్ వరకు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా టియుజెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.బత్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం తొలిదశ ఉద్యమంలో 369 మంది తుపాకి తూటాలకు బలియైనారు మలి దశలో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకున్నారు శారీరకంగా వృత్తి రిత్యా ఆర్థిక పరంగా అన్ని రకాలుగా నష్టపోయారని అన్నారు. ఇప్పటి ప్రభుత్వమైనా ఉద్యమకారుల కు అన్ని రకాలుగా సహకరిస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. పది సంవత్సరాల బిఆర్ యస్ పాలన ఉద్యమకారులు ఆశలను వమ్ము చేసింది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామిలు నేరవేర్చుతారని కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారం లోకి తీసుకుని వస్తే అనాటి నుండి హామీలు అమలు చేస్తారని సోనియమ్మ రుణం తీర్చుకోవాలని కొండత ఆశతో ఎదురుచూస్తున్నాము. కానీ మీరు ఫ్యూచర్ సిటీ మూసీ సుందరీకరణ రీజనల్ రింగ్ రోడ్డు 6 గార్యంటీలు అందాల పోటీలంటూ వేలకోట్లు కేటాయిస్తున్నారు. సంవత్సరాల తరబడి నిత్యం రోడ్ల మీదకెక్కి ఉద్యమాలు చేసి ఒంటి మీద పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోని ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరుల కుటుంబాలకు ఉద్యమకారులకు కొంతైనా న్యాయం చేశారా ? కేసిఆర్ కుటుంబం అవసరం లేని ఉపయోగం లేని ప్రాజెక్ట్ పేరుతో కమీషన్ల కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఉద్యమకారులను విస్మరించారు.మీరూ ఆ బాటలోనే నడవద్దని తక్షణమే ఉద్యమకారులకు ఒక కార్పోరేషన్ ఏర్పాటు చేసి డిమాండ్లను నిరవేర్చాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా ఉద్యమకారుల తరుపున కోరారు.మీరు మ్యానిఫెస్టో పెట్టిన డిమాండ్స్ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం వారికి గుర్తింపుకార్డులు జారీ చేయాలి తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి తెలంగాణ ఉద్యమకారులకు ప్రతినెల 30 వేల రూపాయల పెన్షన్ తెలంగాణ ఉద్యమకారులకు ఉచిత బస్పాసులు మరియు హెల్త్ కార్డులు ప్రభుత్వ పథకాలలో మరియు ఉద్యోగాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా పని చేసిన కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబల రామారావు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి కృష్ణ అంగిడి బిక్షం ఫక్రుద్దీన్ తునికి పాటి చారి ఉల్లోజు వెంకన్న వి రాజేష్ నాయక్ వడ్డబోయిన వెంకటేశ్వర్లు కొమ్ము రమా కే అరుణ జంపాన అంజయ్య బాలికొండ పాపయ్య తుడుం వీరబాబు గూగులోతు మాంగ్యలాల్ గుమ్మ శాంతమ్మ కాలింగి గురవయ్య కుర్రి ముత్తయ్య చాగంటి ప్రసాద్ బండి వెంకట్ పోలూరి రాము ఎడవెల్లి శ్రీను బయ్యారం శ్రీను రామాంజనేయులు శ్యామ్ ఉపేందర్ బొడ్డు నాగేశ్వరావు మేరీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ ఫార్మసిస్ట్ అవార్డు అందుకున్న ఏర్వ వందన నేత

**ప్రజారోగ్యం కోసం సేవలందించిన వందనకు ఘన గౌరవం**





గండిపేట్: సూర్య ప్రతినిధి

కామినేని హాస్పిటల్ రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఐదు డివిజన్లకు చెందిన పలువురు ఆరోగ్య సిబ్బందికి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులు అందజేశారు. ఈ అవార్డు గ్రహీతల్లో రాజేంద్రనగర్ డివిజన్ నుండి హాసన్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ ఏర్వ వందన కూడా ఉన్నారు. ఆమెను ఫార్మసిస్ట్ క్యాడర్లో "బెస్ట్ పెర్ఫార్మర్"గా ఎంపిక చేసి సత్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు (డిహెచ్ఎంఒ) మరియు ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ విజయపూర్ణిమ (డిప్యూటీ డిహెచ్ఎంఒ) వందనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మరియు డాక్టర్ విజయపూర్ణిమ మాట్లాడుతూ... ప్రజారోగ్యం కోసం నిబద్ధతతో సేవలందిస్తున్న సిబ్బందిని గుర్తించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశ్యం. ఫార్మసిస్ట్ వందన ఎంతో పరిశుభ్రతతో, సమయపాలనతో తమ విధులను నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ఆమె ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారు," అని కొనియాడారు. అవార్డు అందుకున్న ఫార్మసిస్ట్ ఏర్వ వందన మాట్లాడుతూ... ఈ అవార్డు నాకు గర్వకారణమైన విషయమే కాకుండా, సేవల పట్ల మరింత బాధ్యతను కలిగించింది. నా కృషిని గుర్తించి గౌరవించిన అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గౌరవాన్ని నా రాజేంద్రనగర్ డివిజన్కు అంకితం చేస్తున్నాను,అని అన్నారు.

## మార్కెట్ యకూబ్ కు ఘన నివాళులు

ఖమ్మం( సూర్య ప్రతినిధి )



ఖమ్మం వ్యవసాయ మార్కెట్ల కమిషన్ వ్యాపారి ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ లతీఫ్ తండ్రి యాకూబ్ దశదిన కర్మ ఖమ్మం కిరాణం అండ్ జాకీర్ మర్చంట్ లో నిర్వహించగా రాష్ట్ర నాయకులు సాధు రమేష్ రెడ్డి ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ ఆత్మ కమిటీ చైర్మన్ చిన్న వెంకటేశ్వర్లు రెంటల ప్రసాద్ సింగు రాజయ్య ఎండి అశ్రీఫ్ భాణాల లక్ష్మణ్ బొమ్మ ఉదయ్ తదితరులు హాజరై యకూబ్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

## నాగార్జున కాలనీలో రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



కూకట్ పల్లి, జులై 17 (ప్రభాత సూర్య) :

కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలో గల నాగార్జున కాలనీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ. 17 లక్షల వ్యయంతో నాగార్జున కాలనీలో రోడ్డు పనులను స్థానికుల స్థానిక ప్రజలతో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నాగార్జున కాలనీ లోతట్టు ప్రాంతం కాబట్టి రోడ్ ఎత్తు పెంచుట కొరకు 17 లక్షల నిధులతో రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందని, ఈ రోడ్డు వేయడం వల్ల ముంపు సమస్య దాదాపు పరిష్కరించబడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సలావుద్దీన్, రహాన్ ఖాన్, అస్లాం, సత్యనారాయణ యాదవ్ సతీష్, షఫీ, మాణిక్ గుప్తా, పాల్గొనారు.

## శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లిని దర్శించుకున్న బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

కూకట్ పల్లి, జులై 17 (ప్రభాత సూర్య) :





కూకట్ పల్లి మూసాపేట్ లోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి ఆషాడమాసం బోనాల పండుగ సందర్భంగా బోనాల జాతర కు ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు గురువారం బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు రవి మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షలకు పాత్రులైన తెలంగాణ రాష్ట్ర కార్మికులు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

**జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**




కూకట్ పల్లి, జులై 17 (ప్రభాత సూర్య) :

లయన్స్ క్లబ్ బాలానగర్ వారి కంటి పరీక్షా కేంద్రము జగద్గిరిగుట్టలో ఎవెన్యూ దయాగ్నస్టిక్స్ క్లినిక్స్ లో కంటి పరీక్ష కేంద్రాన్ని లయన్స్ కంటి హాస్పిటల్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విజన్ సెంటర్ని లయన్స్ క్లబ్ బాలానగర్ చైర్మన్ సాంబశివరావు, జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కె.జగన్, పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రా రెడ్డి, ఆనంద్ తెట్టెబావితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఉన్న నిరుపేద మధ్యతరగతి వారికి అందుబాటులో కంటి పరీక్ష కేంద్రాన్ని కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరి వినియోగించుకోవాలని ఎవెన్యూ ప్రతినిధి టి.దీనమణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్ ఆంటోనీ స్కూల్ ప్రిన్సిపల్ జీవన్ ప్రసాద్, సిహెచ్. మాణిక్యం, భగవంత్ రెడ్డి, ప్రభాకర్, ప్రసాద్, విఘ్నేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎవెన్యూ దయాగ్నస్టిక్స్ క్లినిక్స్, పాపిరెడ్డి నగర్ కమాన్, ఆగ్రా స్వీట్ హౌస్ ప్రక్కన, సంజయ్ గాంధీ నగర్ తదితులు పాల్గొన్నారు.

## నేడు శేరి సతీష్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

**ముఖ్య అతిథి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్**

కూకట్ పల్లి, జులై 17 (ప్రభాత సూర్య) :



కూకట్ పల్లి నియోజకవర్గంలో విశ్వాసపాత్ర నాయకుడిగా, ప్రజల నమ్మకాన్ని చూరగొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ పట్టణ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నేడు అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కెపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. సుదీర్ఘకాలంగా పార్టీ మారకుండా కాంగ్రెస్ పట్ల నిబద్ధతతో నిలిచిన నాయకుడిగా సతీష్ రెడ్డి, పి.జె.ఆర్ శిష్యరికంలో రాజకీయ అనుభవాన్ని ఆర్జించి, ప్రజల సమస్యల పరిష్కారంలో విశేష పాత్ర పోషిస్తున్నారు. ఆయన పుట్టినరోజును సేవా దినంగా మార్చుకోవడం నాయకుడిగా ఆయన ప్రత్యేకతను ప్రతిబింబిస్తోందని తెలిపారు.

## కానిస్టేబుల్ రవికి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి

మర్రిగూడ(ప్రభాత సూర్య):-



చింతపల్లి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న రవి నాయక్ కు కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన సందర్భంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆయనకు పట్టీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని క్రమశిక్షణతో, బాధ్యతగా పనిచేస్తూ, ప్రజల మన్ననలు పొందుతూ, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పని చేయాలని వారికి సూచించారు. పోలీసు స్టేషన్ కు వచ్చే పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ, సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తూ, తమకు అప్పగించిన విధులను క్రమశిక్షణతో బాధ్యతతో పని చేయాలని, అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సంఘం అధ్యక్షుడు జయరాజు తదితరులున్నారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేత



సంస్థాన్ నారాయణపురం, జూలై 17( ప్రభాత సూర్య):

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు శాసనసభ్యుల సిఫారసుతో

సంస్థాన్ నారాయణపురం మండలం కోతులాపురం గ్రామానికి చెందిన కురుమిద్ద రమాదేవి కి అనారోగ్య%శీ%తో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నది. వైద్య ఖర్చుల సహాయార్థం రూ. 250000 ఎల్ ఓ సి బాధితురాలకు అందజేశారు.డిసిసి ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించే విధంగా సంక్షేమ సామాజిక పథకాలను అమలుపరచుతూ పేదల జీవితాలలో వెలుగును నింపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు . ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కురుమిద్ద గోపాలు,గ్రామ శాఖ అధ్యక్షులు పొట్ట వెంకటేశం గౌడ్,కురుమిద్ద సుధాకర్ కొత్త మారయ్య,గడ్డం రాములు, చిరగోని మహేష్,కురుమిద్ద పెంటయ్య, కొత్త కొమురయ్య, పొట్ట రమేష్, మారగొని నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియపరచడం జరిగింది.

## డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయండి



నల్గొండ జులై 17 ప్రభాత సూర్య

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ గంజాయి బెట్టింగ్ మరియు లోన్ యాప్ లను అరికట్టాలని జులై 24 నకరేకల్ లో ప్రారంభమై ఆగస్టు 02 న మిర్యాలగూడ వరకు జరిగే సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ పిలుపునిచ్చారు గురువారం దొడ్డి కోమరయ్య భవన్ లో సైకిల్ యాత్ర సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అతిపెద్ద యువజన సంఘం ఉందన్నారు. అట్లాంటి డివైఎఫ్ఐ నేడు యువతను పట్టిపీడిస్తు బానిసలు చేస్తున్న గంజాయి డ్రగ్స్ మరియు ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లను అరికట్టి యువతను చైతన్యం చేయడానికి సైకిల్ యాత్ర నిర్వహించడం జరుగుతుందని అన్నారు . దేశంలో యువత నేడు పలు రకాల వ్యసనాలకు బానిసలు అవుతు సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్నారని అన్నారు. యువతలో మార్పు తీసుకురావడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు వడ్డ గాని మహేష్, కట్ట లింగస్వామి నాయకులు బి లింగరాజు, అలివేలు, ఎన్ నాగయ్య, జి మహేష్, ఎం కిరణ్, వై యాదగిరి, జి రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు

## నీటి సరఫరాకు అంతరాయం...ప్రజలు సహకరించాలి

చౌటుప్పల్. జులై 17. ప్రభాత సూర్య :

గత రెండు రోజులుగా మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి మండలం, ఎస్ డబ్ల్యూ లింగోటం గ్రామంలో ఉన్న 70 ఎం ఎల్ డి డబ్ల్యూ టి పి నీటి శుద్ధీకరణ ప్లాంటులో పలమార్లు తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను పూర్తిగా పరిష్కరించుటకు గాను శుక్ర,శనివారం రోజులలో నీటి సరఫరా చేసే పంపులను నిలిపివేయడం జరుగుతుంది లేదా పాక్షికంగా నిలుపుదల చేయడం జరుగుతుంది. కావున మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా జరిగే ఆవాసాల వారు ప్రత్యామ్నాయ నీటి వసతి ఏర్పాట్లు చేయగలరని మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ చౌటుప్పల్ డివిజన్ వారు పత్రికకు ఇచ్చిన ప్రకటన ద్వారా తెలియజేశారు. చౌటుప్పల్ పురపాలక సంఘ పరిధిలోని 1,2,3,8, 9,10,11,12,13,19 వార్డు ప్రజలు నీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్యఉన్నా డి సంతోష్ 7799883937 హెల్ప్ డెస్క్ నెంబర్ కు, అలాగే 4,5,6,7,14,15,16,17,18, 20 వార్డులవారు ఎన్ సునీల్ 7013594121 అను హెల్ప్ డెస్క్ నెంబర్లకు సంప్రదించాలని చౌటుప్పల్ పురపాలక సంఘ కార్యాలయం పత్రికకు జారీచేసిన ప్రకటన ద్వారా చౌటుప్పల్ పురపాలక సంఘ ప్రజలకు తెలిపి సహకరించాలని కోరారు .

## ఎస్ ఆర్ హెచ్ ఫ్యామిలీ సెలూన్‌ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




శేరిలింగంపల్లి ప్రభాత సూర్య

శేరిలింగంపల్లి డివిజన్ లోగల కాంతివనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ ఆర్ హెచ్ సెలూన్ ను మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , పిఏసీ ఛైర్మెన్, స్థానిక శాసనసభ్యులు అరికపూడి గాంధీ, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు పలువురు ప్రముఖులతో కలిసి ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంతివనంలో నూతన హంగులతో 10వ బ్రాంచ్ ఎస్ ఆర్ హెచ్ ఫ్యామిలీ సెలూన్ ను ప్రారంభించడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ సెలూన్ దినదినాభివృద్ధి చెందాలని, భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్ లను ప్రారంభించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సెలూన్ నిర్వాహకులు విచ్చేసిన అతిథులను శాలువా కప్పి బోకేలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సీనియర్ నాయకులు, సెలూన్ నిర్వాహకులు మాదాసు రమేష్, ఉపేందర్ వారి కుటుంబ సభ్యులు తిరుపతి, సింహాద్రి, బాలు యాదవ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మర్రిగూడ(ప్రభాత సూర్య)



ఒక వ్యక్తి, అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం, మండలంలోని ఇందుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నాంపల్లి మండలం, దామెర గ్రామానికి చెందిన బత్తుల సైదులు అనే వ్యక్తి, ఇందుర్తి గ్రామానికి చెందిన సరిత అనే మహిళా ఇంటి ముందు, పురుగుల మందు తాగి మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుడి బంధువులు, గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చనిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఏంటనేది తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మృతుడి తండ్రి బత్తుల నర్సింహ పిర్యాదు మేరకు, మర్రిగూడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. మృతి పట్ల కారణాలపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## సర్కిల్ 21 చందానగర్‌లో చైన్ మెన్ లు లేక అక్రమ కట్టడాల జోరు

మాదాపూర్ ప్రభాత సూర్య

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని సర్కిల్ 21 చందానగర్ లో విపరీతమైన అక్రమ కట్టడాలు జోరు అందుకున్నవి ఎందువలన అంటే గత నెల 25.06. 2025 నాడు అంటే దాదాపు 22 రోజుల క్రితం ఇద్దరు చైన్ మెన్ లు ఒకేసారి పదోన్నతలు చెంది బదిలీ కావడం జరిగింది వీరి స్థానాలలో ఇంతవరకు ఎలాంటి అధికారులు రాలేరు జోనల్ కమిషనర్ కూడా ఇంతవరకు సర్కిల్ 21 పైన ఆలోచన చేయలేరు అలాగే జోనల్ సి పి కూడా ఇంతవరకు చైన్ మెన్ల గురించి ఆలోచించకపోవడం విడ్డూరం ఎందుకంటే అధికారులు ఎ. సి పి గాని మరియు టి పి ఎస్ లు గాని అనుమతులు లేని అక్రమ కట్టడాల చెంతకు వీరు వెళ్ళలేరు గ్రౌండ్ రిపోర్టు తేలేరు ఇదే అదునుగా అక్రమ నిర్మాణదారులు భారీ ఎత్తుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు జి హెచ్ ఎం సి నిధులకు గండి కొడుతున్నారు తెలంగాణ రాష్ట్రానికి నష్టం ఏర్పడుతుంది కావున నిరంతరం ప్రజల క్షేమమే ఆలోచన చేస్తూ తిరిగే మిద్దెల మల్లారెడ్డి వెంటనే సర్కిల్ 21లో చైన్ మెన్ లను తక్షణమే ఏర్పాటు చేయాలని మీడియా ద్వారా అధికారులను కోరుతున్నారు.

## భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ప్రకాశం, జూలై 17( ప్రభాత సూర్య):




గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని ఏబీఎం పాలెం లో నివాసముండే కటికల సైమన్ నిన్న రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సైమన్ కుటుంబం చాలా పేద కుటుంబం కూలి పనులకు వెళ్తే కానీ ఇల్లు గడవదు. దీంతో వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది ప్రస్తుతం కుటుంబ సభ్యులు సైమన్ అంతక్రియలు పూర్తిచేసేందుకు ఆర్థిక వనరులు లేక అవస్థలు పడుతున్నారు. దయ కలిగిన దాతలు మా కుటుంబాన్ని ఆదుకొని తోచిన ఆర్థిక సహాయాన్ని అందించాలని సైమన్ కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో వేడుకుంటున్నారు. అన్న విషయాన్ని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ అభిమాని మల్లెబోయిన వినోద్ కుమార్ సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకుని అంత్యక్రియలను మొత్తం నేను నిర్వహిస్తాను అని చెప్పి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి బాధిత కుటుంబసభ్యులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేస్తాను అని ముందుకు వచ్చారు అలాగే అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కోశాధికారి పి.సుధాకర్ యాదవ్ ద్వారా ?3000 రూపాయలు టోటల్ గా ఎనిమిదివేల రూపాయలును బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భారత చైతన్య యువజన పార్టీ గిద్దలూరు నియోకవర్గ సమన్వయ కర్త కమ్మనేతుల విజయరామరాజు నగదును అందచేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు అందరికీ సైమన్ కుటుంబ సభ్యులు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి సి వై పార్టీ కార్యకర్తలు వెంకటేష్ , రామకృష్ణ ,హరికృష్ణ, వెంకీ, రవి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి సహకారంతో యశోదలో వ్యక్తికి చికిత్స

మర్రిగూడ(ప్రభాత సూర్య):-





రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన కొద్ది మొత్తానికి తోడు, లక్షల రూపాయలు అప్పులు చేసి చికిత్స చేయించినా బిడ్డ కదలకపాయే మెదలకపాయె ఎవరిని గుర్తుపట్టక పాయె. తమ కష్టం పగోడికి కూడా రావదంటూ, మొక్కని దేవుడు లేడు తలవని దేవత లేదు. మాకు ఎవరు దిక్కు రా దేవుడా అంటూ ఎదురుచూస్తున్న తరుణంలో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, ఇచ్చిన భరోసా ఆ కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. నీ కొడుకును కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి, మెరుగైన చికిత్స అందిస్తానని రాజగోపాల్ రెడ్డి ఇచ్చిన హామీతో బిడ్డపై ఆశలు మళ్ళీ చిగురించాయి. ఇచ్చిన హామీ ప్రకారం గురువారం యశోద ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. ఇక వివరాలలోకి వెళ్తే, మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండలంలోని యరుగండ్లపల్లి గ్రామానికి చెందిన, చామకూరి తిరుపతయ్య రెండు సంవత్సరాల క్రితం కుటుంబంతో గొడవపడి, ఆవేశంతో పాయిజన్ తీసుకున్నాడు. ఆసుపత్రులో చేర్పించి లక్షల రూపాయలు అప్పులు చేసి చికిత్స అందించినప్పటికీ, బ్రతికాడు కానీ కదలలేదు, మెదలలేదు, ఎవరిని గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఎదిగిన కొడుకు జీవచ్ఛవంలా ఇంట్లో ఉండడంతో, ఆ తల్లిదండ్రులు అనుభవించిన ఆవేదన అంతాఇంతా కాదనే చెప్పాలి. తల్లిదండ్రులతో పాటు తన భర్త మెరుగైన చికిత్స కోసం, ఉన్న అరఎకరం భూమి అమ్మింది భార్య నర్మద. తనకున్న ఇద్దరు చిన్న పిల్లలతో పాటు జీవచ్ఛవంలా మారిన భర్తకు సేవ చేస్తూ, కూలీ పని చేసుకుంటూ జీవనం వెలదీస్తోంది. జూన్ 27న గ్రామసమస్యలు తెలుసుకోవడానికి, నేరుగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి యరుగండ్లపల్లి గ్రామానికి, మార్నింగ్ వాక్ కి వెళ్లిన, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దృష్టికి, తిరుపతయ్య పడుతున్న ఇబ్బందిని వారి కుటుంబం పడుతున్న, ఆవేదనను స్థానిక నాయకులు తీసుకెళ్లారు. ఆ రోజే తిరుపతయ్య తిరిగి నయం అవ్వడానికి, తనవంతు ప్రయత్నం చేస్తానని, మాట ఇస్తూనే ధైర్యం కోల్పోవద్దని, మీకు నేనున్నానన్నారు రాజగోపాల్ రెడ్డి. ఇచ్చిన మాట ప్రకారం గురువారం హైదరాబాదులోని, యశోద ఆసుపత్రిలో తిరుపతయ్యకు చికిత్స చేయిస్తున్నారు. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశంతో, యరుగండ్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, తిరుపతయ్యను యశోద ఆసుపత్రికి తీసుకెళ్లడంతో చికిత్స ప్రారంభించారు డాక్టర్లు. తిరుపతయ్య తిరిగి కోలుకోవడానికి మానవ ప్రయత్నంగా తనవంతు సహకారం అందిస్తానని, ఇచ్చిన మాట ప్రకారం తిరుపతయ్యకు చికిత్స చేయిస్తుండడంతో, కుటుంబ సభ్యులకు ధైర్యం వచ్చినట్లయింది.

## బోనాలు పండుగ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి



తుర్కయంజాల్,జూలై 17, ప్రభాత సూర్య:

తుర్కయంజాల్ పురపాలక పరిధి లోనీ అన్ని గ్రామాలలో బోనాల పండగకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు తుర్కయంజాల్ కమిషనర్ కే.అమరేందర్ రెడ్డి ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పలు వార్డులలో ఉన్నటువంటి దేవాలయాల ప్రాంగణంలో సూక్ష్మమైన సమస్యలను వార్డ్ అధికారులు, జవాన్ లు, ఎలక్ట్రీషియన్స్ ల సమావేశం నిర్వహించి త్వరలో జరగబోయే బోనాల పండగ కు సంబంధించి పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని దేవాలయలు ఉన్న ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని రోడ్ల పై మట్టి ఉండకుండా చర్యలు తీసుకోవాలని వీధి లైట్లు పని చేసేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని కాలనీ లలో పారిశుధ్య పనులు,దోమల నివారణ చర్యలు మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలని,ఫాగింగ్ చేపట్టాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లో డి.ఈ భిక్షపతి, ఏ.ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.ఓ శ్రీనివాసులు శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్,వార్డ్ అధికారులు,జవాన్ లు, ఎలక్ట్రీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ

### రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్



తుర్కయంజాల్,జూలై 17, ప్రభాత సూర్య:

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దళితులపై, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఖమ్మంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో జరిగిన పోలీసు దాడిలో గాయపడి, పంజాగుట్ట నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ ని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ పరామర్శించారు. ఈ సందర్భంగా బోసు పల్లి ప్రతాప్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న దళిత నేతలపై దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ కుట్ర రాజకీయాలకి నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

## గాలిబ్ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం

### -రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాషా ఆధ్వర్యంలో



ఖమ్మం ( సూర్య ప్రతినిధి)

నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు షేక్ గాలిబ్ నాలుగో వర్ధంతి సందర్భంగా స్థానిక కరుణగిరిలోని వృద్ధ అనాథ మహిళలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాషా పాల్గొని దూదేకుల హక్కుల కోసం పోరాడ్తామని చెప్పారు. ప్రధాన కార్యదర్శి రహీమ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీ బేగం మహిళా ఉపాధ్యక్షురాలు సకినాబీ జిల్లా అధ్యక్షులు రహీం పాషా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సొందు లాలు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దు పాషా ఖమ్మం నగర అధ్యక్షుడు రసూల్ నగర ప్రధాన కార్యదర్శి సైదా హుస్సేన్ సీనియర్ నాయకులు సైదులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసీం ఫరీదు సాయిబు హుస్సేన్ దుర్గాభాష మౌలానా ఖాదర్ మస్తాన్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## బొత్స కుటుంబంలో చీలక...

విజయనగరం

బొత్స కుటుంబంలో చీలిక వచ్చిందా? ఆధిపత్య పోరు ప్రారంభం అయ్యిందా? వచ్చే ఎన్నికల్లో తలో దారిన వెళ్ళనున్నారా? విజయనగరం పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఆ కుటుంబానికి చెందిన ఓ నేత రాజకీయ చిరకాల ప్రత్యర్థిని ప్రశంసించడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల గోవా గవర్నర్గా సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన నియామకంతో టిడిపి కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. సీనియారిటీతోపాటు సిన్సియారిటీకి సరైన గౌరవం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అశోక్ గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అనూహ్యంగా తన చిరకాల ప్రత్యర్థి అయిన బొత్స కుటుంబం నుంచి ఓ మాజీ ఎమ్మెల్యే అశోక్ గజపతి రాజుకు అభినందనలు తెలపడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుందివిజయనగరం జిల్లాలో) బొత్స కుటుంబానిది ఒక హవా. కాంగ్రెస్ హయాంలో పెనుమత్స సాంబశివరాజు ఒక వెలుగు వెలిగారు. ఆయన శిష్యరికంలో పనిచేశారు బొత్స. కానీ తనకున్న సామాజిక, కుటుంబ బలంతో ఒక రాష్ట్రస్థాయి నేతగా ఎదిగారు. ఉత్తరాంధ్రలో తనకంటూ ఒక మార్క్ చూపించారు. విజయనగరం జిల్లాలో అశోక్ గజపతిరాజుకు ధీటుగా రాజకీయాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు మొన్నటి వైసిపి ప్రభుత్వం లో ఒక వెలుగు వెలిగారు. తాను చీపురుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రి పదవి చేపట్టేవారు. సోదరుడు అప్పల నరసయ్య గజపతినగరం నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. మరో సమీప బంధువు బడ్డు కొండ అప్పలనాయుడు నెల్లిమర్ల శాసనసభ్యుడిగా ఉండేవారు. స్వయానా మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్గా ఇప్పటికీ కొనసాగుతున్నారు. అయితే మొన్నటి ఎన్నికల్లో బొత్స తో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా ఓడిపోయారు. ప్రస్తుతం బొత్స విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నారు. పైగా శాసనమండలిలో విపక్ష నేతగా కొనసాగుతున్నారు.విజయనగరం జిల్లాలో పూసపాటి అశోక్ గజపతి రాజుతో బొత్స కుటుంబానికి దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. అయితే ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు అశోక్ గజపతిరాజు. ఈ క్రమంలో అశోక్ ను గోవా గవర్నర్ గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆకాశానికి ఎత్తేశారు.



# కింగ్‌డమ్ హీరోకు డెంగ్యూ.. ఆస్పత్రిలో విజయ్ దేవరకొండ !

ఫిల్మ్ స్టార్ విజయ్ దేవరకొండ  ఆస్పత్రిలో చేరాడు. అతను డెంగ్యూతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈనెల 20వ తేదీన అతను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. విజయ్ దేవరకొండ కానీ ఇతర సభ్యులు ఎవరూ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. దేవరకొండ నటించిన కొత్త చిత్రం కింగ్‌డమ్ ఈనెల 31వ తేదీన రిలీజ్ కానున్నది. కింగ్‌డమ్ చిత్రాన్ని గౌతం తిన్ననూరి డైరెక్ట్ చేశాడు. ఆ ఫిల్మ్‌లో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్ నటిస్తున్నారు. సీతార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చూనర్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై ఆ మూవీని రిలీజ్ చేస్తున్నారు. పూర్తి స్థాయి కమర్షియల్ ఫిల్మ్‌గా కింగ్‌డమ్‌ను రూపొందించారు. వాస్తవానికి మార్చి 30న రిలీజ్ కావాల్సిన ఆ సినిమాను పోస్టు ప్రొడక్షన్ సమస్య వల్ల వాయిదా వేశారు. కింగ్‌డమ్ ఫిల్మ్‌కు చెందిన హిందీ వర్షన్‌ను థియేటర్లలో కాకుండా నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న డాన్ 3 చిత్రంలో విలన్ పాత్రలో విజయ్ దేవరకొండ పోషించనున్నట్లు తెలుస్తోంది. ఫర్హన్ అక్తర్‌కు సంబంధించిన ఆ ఫిల్మ్‌లో విక్రాంత్ మాసే స్థానంలో దేవరకొండకు ఛాన్స్ దక్కినట్లు కొన్ని రూమర్స్

# అమ్మాయి పోస్టర్ చూడగానే అందరూ పారిపోతారు

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో వస్తోన్న చిత్రం పరదా. లేడీ ఓరియంటెడ్ మూవీగా వస్తోన్న ఈ సినిమాకు ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా నుంచి ఓ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాజరైన అనుపమ పరమేశ్వరన్ తన సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఒక అమ్మాయి లీడ్ రోల్‌గా సినిమా పోస్టర్ చూస్తే అందరూ కూడా వెనక్కి వెళ్లిపోతారని అనుపమ తెలిపింది. అది ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఓటీటీతో పాటు ఆడియన్స్ కూడా కావొచ్చని పేర్కొంది. అయితే అది తప్పని నేను చెప్పట్లేదు..అదే రియాలిటీ అని అనుపమ వెల్లడించింది. ఆ రియాలిటీ నుంచే వచ్చిన సినిమా పరదా అని.. మా సినిమా దాదాపు ఏడాది క్రితమే పూర్తయిందని అనుపమ పరమేశ్వరన్ చెప్పుకొచ్చింది.  మా సినిమా రిలీజ్ డేట్ కోసం చాలా కష్టపడ్డామని.. చివరికీ ఆగస్టు 22న మీ ముందుకు వస్తున్నామని తెలిపింది.






# తెలుగులోకి రాబోతున్న తమిళ సూపర్‌హిట్ 'మై బేబీ'.. ఆసక్తికరంగా ట్రైలర్

ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన '%ఐచీూ%' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబి' పేరుతో ఈనెల జూలై 18న థియేటర్లలో విడుదల చేయబోతున్నారు. నెల్సన్ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిమిషా సజయన్, అథర్వ మురళి కీలక పాత్రల్లో నటించారు. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి విజయవంతమైన అనువాద చిత్రాలను అందించిన సురేష్ కొండేటి, 'మై బేబి'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సినిమా విడుదలకు ఒక్కరోజే ఉండడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హాస్పిటల్ మాఫియా ఆధారంగా తెరకెక్కినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం ఆనంద్ (అథర్వ), దివ్య (నిమిషా సజయన్) అనే జంట చుట్టూ తిరుగుతుంది. ఆనంద్ తన లవ్ ఫెయిల్ అవ్వడం వలన మందుకి బానిసగా మారతాడు. దివ్య బోర్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్ అనే మానసిక సమస్యతో బాధపడుతూ ఉంటుంది. వీరిద్దరికి అనుకోకుండా పెళ్లి జరుగుతుంది. అయితే ఆనంద్ దివ్య మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని, ఆమెను ప్రేమిస్తాడు. వారిద్దరూ సంతోషంగా జీవిస్తారు. ఈ క్రమంలోనే దివ్య గర్భవతి అవుతుంది, వారికి ఒక బాబు పుడతాడు. అయితే, బిడ్డ పుట్టిన కొన్ని నిమిషాలకే, ఆ బిడ్డ తమది కాదని, ఎవరో ఆసుపత్రిలో మార్చేశారని దివ్య పదేపదే చెబుతుంది. ఆమె మానసిక స్థితి కారణంగా మొదట ఎవరూ ఆమె మాటలు నమ్మరు. కానీ ఆనంద్ తన భార్య మాటలను నమ్మి, నిజం తెలుసుకోవడానికి బయలుదేరతాడు. ఆనంద్ తన బిడ్డను కనుగొనడానికి వెళ్లిన క్రమంలో పిల్లలను కిడ్నాప్ చేసి అమ్ముకునే ఒక పెద్ద నెట్‌వర్క్‌ను కనుగొంటాడు. అయితే ఈ నెట్‌వర్క్‌ని నడిపిస్తుంది ఎవరు. ఆనంద్ ఈ నెట్‌వర్క్‌ని ఎలా కనిపెట్టాడు. దివ్య తనకి పుట్టిన బిడ్డని మార్చేశారు అని ఎలా తెలుసుకుంటుంది అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.



## సత్యదేవ్ కోటి రూపాయల ఆర్టిస్ట్.. ఆ మార్క్ ఎప్పుడో దాటేశాడు!

టాలెంట్ ఆర్టిస్ట్ సత్యదేవ్ మొదట్లో హీరో స్నేహితుడి పాత్రలు చేసేవాడు. తర్వాత విలనిజం చేశాడు. అలాగే హీరోగానూ సినిమాలు చేస్తున్నాడు. ఆ మధ్య ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోనూ యాక్ట్ చేశాడు. కానీ ఎడిటింగ్‌లో తను కనిపించే దాదాపు 16 నిమిషాల సీన్లను లేపేశారు. కావాల్సినంత ప్రతిభ ఉన్నా.. ఎందుకో కాస్త వెనకబడుతున్నాడు. ఇతడు చివరగా నటించిన జీబ్రా కూడా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని అందుకోలేకపోయింది.

**నేనప్పుడే చెప్పా..**

కానీ సత్యదేవ్ దమ్మున్న నటుడని మాత్రం పేరు సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇతడు కింగ్‌డమ్ మూవీలో విజయ్ దేవరకొండ సోదరుడిగా నటిస్తున్నాడు. అలాగే సత్యదేవ్ చేతిలో ఫుల్ బాటిల్, గరుడ: చాప్టర్ 1 చిత్రాలున్నాయి. తాజాగా ఇతడు పరదా సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌కు హాజరయ్యాడు. ఈ క్రమంలో నిర్మాత విజయ్ డొంకాడ.. సత్యదేవ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశాడు. సత్యతో 47 డేస్ సినిమా చేశాను. భయ్యా.. నువ్వు త్వరలోనే కోటి రూపాయల ఆర్టిస్టువి అవుతావు అని ఆ సినిమా షూటింగ్‌లోనే అన్నాను.

**చాలా టాలెంట్**

ఆ రూ.1 కోటి మార్కు ఆయన ఎప్పుడో దాటేశారు. సత్య చాలా టాలెంటెడ్ ఆర్టిస్ట్. ఆయన నాకు ఫ్యామిలీ మెంబర్‌లానే అనిపిస్తాడు అని చెప్పుకొచ్చాడు. పరదా సినిమా విషయానికి వస్తే.. ఇందులో అనుపమ ప్రధాన పాత్రలో నటించింది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాంద్రేగుల దర్శకత్వం వహించగా విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. ఆగస్టు 22న పరదా విడుదల కానుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.